[illegible]
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి-221

Telugu

[PRICE : Rs. 5.00
మూల్యము: రూ. 5.00

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారముతో ప్రచురించబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | मंगलवार | ९ मार्च, १९९३ | १ फाल्गुन, १९१४ शक | खण्ड ८ |
| No. 1 | New Delhi | Tuesday | 9th March, 1993 | 1st Phalgun, 1914 Saka | Vol. 8 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | మంగళవారము | 9 మార్చి, 1993 | 1 ఫాల్గుణ, 1914 శక | సంపుటము 8 |

## MINISTRY OF LAW AND JUSTICE

## LEGISLATIVE DEPARTMENT

New Delhi, 4th February, 1993/12th Magha 1914 Saka

The translations in Telugu of the following, namely :-

(1) The Payment of Gratuity Act, 1972 (39 of 1972)
(2) The Prisoners Act, 1900 (3 of 1900)
(3) The Indian Treasure Trove Act, 1878 (6 of 1878); and
(4) The Land Acquisition Act, 1894 (1 of 1894) are hereby published under the authority the President and shall be deemed to be the authoritative texts thereof in Telugu under clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

### (శాసన నిర్మాణ విభాగము)

న్యూఢిల్లీ, 4 ఫిబ్రవరి, 1993/12 మాఘ, 1914 శక

ఈ క్రింది చట్టములు అనగా :--

(1) ది పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ యాక్టు, 1972 (1972 లోని 39వ చట్టము)
(2) ది ప్రిజనర్స్ యాక్టు, 1900 (1900 లోని 3వ చట్టము)
(3) ది ఇండియన్ ట్రెజర్ ట్రోవ్ యాక్టు, 1878 (1878 లోని 6వ చట్టము)* మరియు
(4) ది ల్యాండ్ ఎక్విజిషన్ యాక్టు, 1894 (1894 లోని 1వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములు రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములు ఆ చట్టములకు ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# భూమి ఆర్జన చట్టము, 1894

(1894 లోని 1వ చట్టము)

(2 ఫిబ్రవరి 1894)

సార్వజనిక ప్రయోజనముల కొరకును, కంపెనీల కొరకును భూమిని ఆర్జించు శాసనమును సవరించుటకైన చట్టము.

సార్వజనిక ప్రయోజనముల కొరకు, కంపెనీల కొరకు అవసరమైన భూమిని ఆర్జించుటకును, అట్టి ఆర్జన బాబతున చెల్లించవలసిన నష్టపరిహార మొత్తమును నిర్ధారణ చేయుటకును అయిన శాసనమును సవరించుట ఉపయుక్తమైనందున ఇందుమూలముగా ఈ క్రింది విధముగా శాసనము చేయడమైనది:-

## భాగము 1.

## ప్రారంభిక.

1. (1) ఈ చట్టమును భూమి ఆర్జన చట్టము, 1894 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ, ప్రారంభము.

(2) ఇది జమ్ము-కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇది, 1894 మార్చి మొదటి దినమున అమలులోనికి వచ్చును.

2. × × × × × × × × ×.

3. ఈ చట్టములో విషయగతమైన లేక సందర్భగతమైన వైరుధ్యమేదేని ఉన్ననే తప్ప,- నిర్వచనములు.

(ఏ) "భూమి" అను పదపరిధిలో, భూమి నుండి లభించు మేలు, మరియు భూబద్ధమైయున్న లేక భూబద్ధమైయున్న దానికి దేనికైనను శాశ్వతముగా బిగించిన వస్తువులు చేరియుండును;

(ఏఏ) "స్థానిక ప్రాధికార సంస్థ" అను పదబంధ పరిధిలో తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము క్రింద ఏర్పాటు చేసినట్టి (ఏ పేరుతో పిలుచునదైనను) పట్టణ ప్రణాళిక ప్రాధికార సంస్థ చేరియుండును;

(బీ) "హితముగల వ్యక్తి" అను పదబంధపరిధిలో, ఈ చట్టము క్రింద భూమి ఆర్జన బాబతున చెల్లించవలసిన నష్టపరిహారమునందు హితమును క్లెయిముచేయు వ్యక్తులందరు చేరియుందురు; ఎవరేని వ్యక్తి భూమికి సంబంధించిన అనుభోగ హక్కులో హితము కలిగియున్నచో అతనిని, ఆ భూమిలో హితముగల వ్యక్తిగ భావించవలెను.

(సీ) "కలెక్టరు" అనగా, ఒక జిల్లా కలెక్టరు అని అర్థము; ఈ పద పరిధిలో, డిప్యూటీ కమీషనరు మరియు ఈ చట్టము క్రింద కలెక్టరు కృత్యములను నిర్వర్తించుటకై సముచిత ప్రభుత్వము ప్రత్యేకముగా నియమించిన ఎవరేని అధికారి చేరియుండును;

(సీసీ) "రాజ్యమునకు చెందిన లేక రాజ్యము నియంత్రణలోనున్న నిగమము" అనగా ఏదేని కేంద్ర, ప్రొవిన్షల్ లేక రాజ్య చట్టము ద్వారాగాని దాని క్రింద గాని

స్థాపించిన (బాడీకార్పోరేటు) *నిగమనికాయము అని అర్థము; ఈ పదబంధ పరిధిలో, 1956 లోని 1వ చట్టము. 1860 లోని 21వ చట్టము. కంపెనీల చట్టము, 1956 యొక్క 617వ పరిచ్ఛేదములో నిర్వచించినట్లు ఒక ప్రభుత్వ కంపెనీ, ప్రభుత్వము స్థాపించిన లేక నిర్వహించుచున్న సంఘము అయియుండి, సంఘముల రిజిస్ట్రీకరణ చట్టము, 1860 క్రింద గాని, ఒక రాజ్యములో తత్సమయమున అమలునందున్న ఏదేని తత్సమాన శాసనము క్రిందగాని రిజిస్టరు చేయబడిన సంఘము, ఏ సహకార సంఘము యొక్క చెల్లించిన వాటా మూలధనములో యాభై ఒక్క శాతమునకు తక్కువ కాకుండ కేంద్ర ప్రభుత్వము గాని, ఏదేని రాజ్యప్రభుత్వము గాని లేక ఏవేని రాజ్యప్రభుత్వములు గాని, భాగత: కేంద్ర ప్రభుత్వము మరియు భాగత: ఒక రాజ్యప్రభుత్వము లేక ఒకటి కంటే ఎక్కువ రాజ్యప్రభుత్వములు గాని కలిగియున్నవో అట్టి సహకార సంఘము అయియుండి ఏదేని రాజ్యములో తత్సమయమున సహకార సంఘములకు సంబంధించి అమలునందున్న ఏదేని శాసనపు భావ పరిధిలోగల సహకార సంఘము చేరియుండును;

(డీ) "న్యాయస్థానము" అనగా ఈ చట్టము క్రింద న్యాయస్థానపు కృత్యము లను నిర్వర్తించుటకు నిర్దిష్టమైన ఏవేని స్థానిక హద్దులలోపల (ప్రత్యేక న్యాయిక అధికారిని నియమించుటకు సముచిత ప్రభుత్వమునకు ఇందుమూలముగా అధికార మొసగినట్లు) ప్రత్యేక న్యాయిక అధికారిని సముచిత ప్రభుత్వము నియమించిననే తప్ప, ఆరంభిక అధికారితగల ప్రధాన సివిలు న్యాయస్థానము అని అర్థము;

(ఈ) "కంపెనీ" అనగా-

1956 లోని 1వ చట్టము. (i) ఖండము (సీసీ)లో నిర్దేశించిన ప్రభుత్వ కంపెనీ మినహా, కంపెనీల చట్టము, 1956 యొక్క 3వ పరిచ్ఛేదములో నిర్వచించిన కంపెనీ,

(ii) ఖండము (సీసీ)లో నిర్దేశించిన సంఘము మినహా, సంఘముల 1860 లోని 21వ చట్టము. రిజిస్ట్రీకరణ చట్టము, 1860 క్రింద గాని, ఏదేని రాజ్యములో తత్సమయమున అమలు నందున్నట్టి ఏదేని తత్సమానమైన శాసనము క్రింద గాని రిజిస్టరు చేయబడిన సంఘము;

(iii) ఖండము (సీసీ)లో నిర్దేశించిన సహకార సంఘము మినహా, ఏదేని రాజ్యములో తత్సమయమున సహకార సంఘములకు సంబంధించి అమలునందున్న ఏదేని శాసనపు భావపరిధిలో గల సహకార సంఘము

అని అర్థము;

(ఈఈ) "సముచిత ప్రభుత్వము" అనగా, సంఘ ప్రయోజనముల కొరకైన భూమి ఆర్జనకు సంబంధించినపుడు కేంద్ర ప్రభుత్వము అనియు, ఏవేని ఇతర ప్రయోజనముల కొరకైన భూమి ఆర్జనకు సంబంధించినపుడు రాజ్యప్రభుత్వము అనియు అర్థము;

(ఎఫ్) "సార్వజనిక ప్రయోజనము" అను పదబంధ పరిధిలో-

(i) గ్రామ కంఠములను సమకూర్చుట, లేక ఇప్పుడున్న గ్రామ కంఠముల విస్తరణ, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి లేక వికాసము;

(ii) పట్టణ లేక గ్రామీణ ప్రణాళిక కొరకు భూమిని సమకూర్చుట;

(iii) ఏదేని ప్రభుత్వ పథకము లేక విధానమునను సరించి సార్వజనిక నిధులతో భూమిని ప్రణాళికాబద్ధముగా అభివృద్ధిచేయుట కొరకు భూమిని సమకూర్చి, ఆ తరువాత ప్రణాళిక ప్రకారము ఇంకను అభివృద్ధిచేయు ఉద్దేశముతో దానిని పూర్తిగా లేక అందు కొంత లీజుకిచ్చుట ద్వారాగాని, హస్తాంతరణము చేయుట ద్వారాగాని లేక నేరుగా విక్రయించుట ద్వారాగాని వ్యయనము చేయుట;

(iv) రాజ్యమునకు చెందిన, లేక రాజ్యము నియంత్రణలోనున్న నిగమము కొరకు భూమిని సమకూర్చుట;

(v) పేదవారికి, భూమి లేని వారికి, ప్రకృతి వైపరీత్యములకు గురియైన ప్రాంతములలో నివసించెడి వ్యక్తులకు, లేక ప్రభుత్వముగాని, ఏదేని స్థానిక ప్రాధికార సంస్థగాని, రాజ్యమునకు చెందిన లేక రాజ్యము నియంత్రణలోనున్న నిగమముగాని చేపట్టిన ఏదేని పథకమును అమలుపరచినందున నిర్వాసితులైనట్టి లేక నష్టపడినట్టి వ్యక్తులకు నివాస సంబంధమైన ప్రయోజనముల కొరకు భూమిని సమకూర్చుట;

(vi) ప్రభుత్వముగాని, ఏదేని విద్యావిషయక, గృహనిర్మాణ, ఆరోగ్య లేక మురికివాడల నిర్మూలన పథకమును అమలుపరుచుటకై ప్రభుత్వము స్థాపించిన ఏదేని ప్రాధికార సంస్థగాని లేక సముచిత ప్రభుత్వము యొక్క పూర్వామోదముతో ఒక స్థానిక ప్రాధికార సంస్థగాని లేక సంఘముల రిజిస్ట్రీకరణ చట్టము, 1860 క్రింద లేదా ఏదేని రాజ్యములో తత్సమయమున అమలునందున్న ఏదేని తత్సమానమైన శాసనము క్రింద రిజిస్టరు చేయబడిన సంఘముగాని ఏదేని రాజ్యములో సహకార సంఘములకు సంబంధించి తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనపు భావపరిధిలో గల సహకార సంఘముగాని బాధ్యతవహించిన ఏదేని అట్టి పథకమును అమలుపరచుటకు భూమిని సమకూర్చుట; 1860 లోని 21వ చట్టము.

(vii) ప్రభుత్వముగాని, సముచిత ప్రభుత్వము యొక్క పూర్వామోదముతో ఏదేని స్థానిక ప్రాధికార సంస్థగాని బాధ్యతవహించిన ఏదేని ఇతర అభివృద్ధి పథకము కొరకు భూమిని సమకూర్చుట;

(viii) ఏదేని పబ్లికు కార్యాలయమునకు వసతి కల్పించుటకుగాను ఏదేని ఆవరణ లేక భవనమును సమకూర్చుట-

చేరియుండును; కాని కంపెనీలకొరకు భూమిని ఆర్జించుట చేరియుండదు;

(జీ) ఈ క్రింది వ్యక్తులను ఇందు ఇటుపిమ్మట నిబంధించినట్లు మరియు అంతమేరకు "వ్యవహరించుటకు హక్కుగల" వ్యక్తులుగా భావించవలెను, (అనగా)-

లాభదాయక హితము కలిగియున్న ఇతర వ్యక్తులకొరకైన ట్రస్టీలను, అట్టి ఏదేని కేసుకు సంబంధించి లాభదాయక హితము కలిగియున్న వ్యక్తులు, నిరర్హత లేకుండినచో ఎంతమేరకు వ్యవహరించగలిగియుండెడివారో అంతమేరకు వ్యవహరించుటకు హక్కుగల వ్యక్తులుగా భావించవలెను;

ఇంగ్లీషు శాసనము వర్తించు కేసులలో వివాహిత స్త్రీని, అట్లు వ్యవహరించుటకు హక్కుగల వ్యక్తిగను, ఆమె వ్యవహారయోగ్యమైన వయస్సుగలదైనను కాకున్నను, అవివాహిత మరియు వ్యవహారయోగ్యమైన వయస్సుగల స్త్రీ అయి యుండిన ఎట్లో అట్లే అంతేమేరకు, హక్కుగల వ్యక్తిగ భావించవలెను;

మైనర్ల సంరక్షకులను, ఉన్మాదుల లేక జడుల కొరకైన కమిటీలను లేక మేనేజర్లను, వరుసగా ఆ మైనర్లు, ఉన్మాదులు లేక జడులు నిరర్హత లేకుండినచో, ఎంతమేరకు వ్యవహరించగలిగియుండెడి వారో అంతేమేరకు వ్యవహరించుటకు హక్కుగల వ్యక్తులుగా భావించవలెను:

అయితే-

(i) విషయవస్తువునందు ఎవరి హితము, అన్యథా అతడు ఎవరి కొరకు వ్యవహరించుటకు హక్కు కలిగియుండెడివాడో అట్టి హితముగల వ్యక్తి హితమునకు

ప్రతికూలముగనున్నదని కలెక్టరు లేక న్యాయస్థానము తృప్తిచెందునట్లు నిరూపింప బడునో అట్టి ఏ వ్యక్తినైనను "వ్యవహరించుటకు హక్కుగల వ్యక్తి"గా భావించరాదు;

(ii) అట్టి ప్రతి కేసులోను హితముగల వ్యక్తి ఏ దావా మిత్రుని ద్వారా నైనను హాజరుకావచ్చును, లేక అతడు దావా మిత్రుని ద్వారా హాజరుకానిచో, కలెక్టరు లేక, సందర్భానుసారముగ న్యాయస్థానము, ఆ కేసును నడుపుటలో అతని తరఫున వ్యవహరించుటకు ఒక సంరక్షకుని నియమించవచ్చును;

(iii) ఈ చట్టము క్రింది చర్యలలో కలెక్టరు సమక్షమున లేక న్యాయ స్థానము సమక్షమున ఎవరేని దావా మిత్రుని ద్వారా గాని, ఆ కేసు కొరకైన సంరక్షకుని ద్వారా గాని హాజరగు హితముగల వ్యక్తుల విషయములో సివిలు ప్రక్రియా స్మృతికిగల మొదటి అనుసూచిలోని 32వ ఉత్తరువు యొక్క నిబంధనలు, అవశ్యకమైన మార్పులతో, వర్తించును; మరియు

1908 లోని 5వ చట్టము.

(iv) "వ్యవహరించుటకు హక్కుగల" ఏ వ్యక్తియు, ఎవరి కొరకు వ్యవహరించుటకు అతడు హక్కుకలిగియున్నాడో ఆ వ్యక్తికి చెల్లింపదగు నష్ట పరిహారపు డబ్బును స్వీకరించుటకు – ఆ భూమిని అన్యాక్రాంతము చేయుటకును స్వచ్ఛంద విక్రయములో క్రయధనమును స్వీకరించి సరియైన ఉన్మోచన చేయుటకును అతనికి సమర్థత ఉండియున్ననే తప్ప – సమర్థుడుకాడు.

## భాగము 2.

## అర్జన

### ప్రారంభిక దర్యాప్తు

ప్రారంభిక అధిసూచన యొక్క ప్రచురణ, తదుపరి అధికారుల అధికారములు.

4. (1) ఏదేని ప్రాంతములోని భూమి ఏదేని సార్వజనిక ప్రయోజనము కొరకు లేక ఒక కంపెనీ కొరకు అవసరమని లేక బహుశ: అవసరముకాగలదని సముచిత ప్రభుత్వమునకు తోచినపుడెల్లను, అట్లని ఒక అధిసూచనను రాజపత్రములోను, ఆ ప్రాంతములో *చలామణిలోనున్న రెండు దినపత్రికలలోను ప్రచురించవలెను ఆ పత్రికలలో కనీసము ఒకటి ప్రాంతీయ భాషలో ఉండవలెను – కలెక్టరు, అట్టి అధిసూచన సారంశపు సార్వజనిక నోటీసును సదరు ప్రాంతములో అనువైన స్థలములలో ఇప్పించ వలెను (అట్లు ప్రచురించుట మరియు అట్టి సార్వజనిక నోటీసు ఇప్పించుట – వీటిలో ఏది చివర జరుగునో దాని తేదీని, ఇందు ఇటు పిమ్మట అధిసూచన యొక్క ప్రచురణ తేదీ అని నిర్దేశించనైనది).

(2) తదుపరి అట్టి ప్రభుత్వముచే ఈ విషయమున సాధారణముగాగాని ప్రత్యే కముగా గాని ప్రాధికారము పొందిన ఎవరేని అధికారి, అతని సేవకులు మరియు పనివారలు–

అట్టి ప్రాంతములోని ఏదేని భూమిపై ప్రవేశించి, దానిని సర్వేచేయుట, దాని కొలతలు తీసికొనుట,

నేలను త్రవ్వుట లేక అందు బోర్‌వేయుట.

ఆ భూమి అట్టి ప్రయోజనముల కొరకు అనుకూలమైనదేనా అని తెలిసికొనుటకు అవశ్యకమైన ఇతర కార్యములన్నియు చేయుట,

తీసికొనుటకు ప్రతిపాదించిన భూమి సరిహద్దులను ఆ భూమిపై చేయుటకు ప్రతిపాదించిన పని (ఏదేని ఉన్నచో) దానికై ఉద్దేశించిన రేఖలను ఏర్పరచుట,

---

*సర్కులేషను.

గుర్తులు పెట్టుట ద్వారాను కందకములు త్రవ్వుట ద్వారాను అట్టి నేలకు, సరిహద్దులకు, రేఖలకు గుర్తువేయుట;

మరియు అన్యథా ఆ సర్వే పూర్తి చేయబడజాలనియెడల, నేల కొలతలు తీసికొనబడజాలనియెడల, సరిహద్దులు మరియు రేఖలు గుర్తుపెట్టబడజాలనియెడల, ఏదేని పైరునుకోయుట, కంచెను లేక అడవిలోని ఏదేని భాగమును నరికివేయుట మరియు భూమిని సాఫ్‌చేయుట.

శాసనసమ్మతమైయుండును:

అయితే ఏ వ్యక్తియు ఏదని భవనములోగాని నివాస గృహముయొక్క ప్రహరిలో లేక పెరటి తోటలోగాని (దాని ఆక్రమణదారు అనుమతితో తప్ప) ప్రవేశించుటకు తన ఉద్దేశమును తెలుపుచు కనీసము ఏడు దినములు ముందుగా వ్రాతమూలకమైన నోటీసును ఈయకుండ, ప్రవేశించరాదు.

5. అట్టి ప్రాధికారము పొందిన అధికారి అట్లు ప్రవేశించునపుడు, పైన చెప్పినట్లు జరిగిన ఆవశ్యకమైన చెరుపునకంతకును చెల్లించవలెను లేక చెల్లింపజూపవలెను; అట్లు చెల్లించిన లేక చెల్లింపజూపిన మొత్తము తగినంత లేదని వివాదము ఏర్పడిన సందర్భములో అతడు ఆ వివాదమును వెంటనే నిర్ణయమునకై జిల్లా కలెక్టరుకు లేక ఇతర ముఖ్య రెవెన్యూ అధికారికి నిర్దేశించవలెను; అట్టి నిర్ణయము అంతిమమై యుండును.

చెరుపునకై చెల్లింపు.

## <u>ఆక్షేపణలు</u>

5ఏ. (1) ఏదేని సార్వజనిక ప్రయోజనము కొరకు లేక కంపెనీ కొరకు అవసరమని లేక బహుశః అవసరము కాగలదని 4వ పరిచ్ఛేదపు, ఉపపరిచ్ఛేదము (1) క్రింద అధిసూచన జారీచేసినట్టి భూమిలో హితముగల ఏ వ్యక్తియైనను ఆ అధిసూచన ప్రచురింపబడిన తేదీ నుండి ముప్పది దినములలోపల, ఆ భూమియొక్క, లేక ఆ ప్రాంతములోని ఏదేని భూమియొక్క అర్జనకు ఆక్షేపణ తెలుపవచ్చును.

ఆక్షేపణల ఆకర్ణన.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింది ప్రతియొక ఆక్షేపణను వ్రాతమూలకముగా కలెక్టరుకు తెలియజేయవలెను; ఆ ఆక్షేపకుడు స్వయముగాగాని, ఈ విషయమున తాను ప్రాధికారమొసగిన ఎవరేని వ్యక్తి ద్వారా గాని, ప్లీడరు ద్వారాగాని ఆకర్ణింపబడుటకు కలెక్టరు ఆక్షేపకునికి అవకాశము నొసగవలెను; మరియు అట్టి ఆక్షేపణలన్నింటిని ఆకర్ణించిన పిమ్మట తదుపరి పరిశీలన ఏదేని అవసరమని తాను తలచినచో అట్టి పరిశీలన జరిపిన పిమ్మట తాను జరిపిన చర్యల రికార్డుతోసహా, 4వ పరిచ్ఛేదపు, ఉపపరిచ్ఛేదము (1) క్రింద అధిసూచింపబడిన భూమి విషయములో ఒక నివేదికను లేదా అట్టి భూమియొక్క వేరువేరు ఖండముల విషయములో వేరువేరు నివేదికలను, అందు ఆ ఆక్షేపణలపై తన సిఫారసులను చేర్చి, నిర్ణయమునకై సముచిత ప్రభుత్వమునకు పంపవలెను, ఆ ఆక్షేపణలపై సముచిత ప్రభుత్వము ఒసగు నిర్ణయము అంతిమమై యుండును.

(3) భూమిని ఈ చట్టము క్రింద ఆర్జించినచో నష్టపరిహారములో హితమును క్లెయిముచేయుటకు హక్కుకలిగియుండెడి వ్యక్తిని, ఈ పరిచ్ఛేద ప్రయోజనముల కొరకు, ఆ భూమిలో హితముగల వ్యక్తిగా భావించవలెను.

## <u>ఉద్దేశించిన అర్జనను గూర్చిన ప్రఖ్యానము</u>

6. (1) ఈ చట్టములోని భాగము 7 యొక్క నిబంధనలకు లోబడి, పరిచ్ఛేదము 5ఏ యొక్క ఉపపరిచ్ఛేదము (2) క్రింద ఏదేని నివేదికను పంపినచో దానిని పర్యాలోచించిన పిమ్మట, ఫలానా భూమి సార్వజనిక ప్రయోజనము కొరకు లేక ఒక

భూమి సార్వజనిక ప్రయోజనము కొరకు కావలెనను ప్రఖ్యానము.

కంపెనీ కొరకు అవసరమని సముచిత ప్రభుత్వము అభిప్రాయపడినపుడు, అట్టి ప్రభుత్వ కార్యదర్శియొక్క, లేక ఆ ప్రభుత్వ ఉత్తరువులను ధృవీకరించుటకు తగు రీతిగా ప్రాధికారము పొందిన ఎవరేని అధికారియొక్క సంతకముతో అట్లని ఒక ప్రఖ్యానము చేయవలెను; పరిచ్ఛేదము 5ఏ యొక్క ఉపపరిచ్ఛేదము (2) క్రింద (కోరినపుడెల్లను) ఒకే నివేదికను పంపినను, వేరువేరు నివేదికలు పంపినను, 4వ పరిచ్ఛేదపు ఉప పరిచ్ఛేదము (1) క్రింద ఒకే అధిసూచనలో చేర్చిన ఏదేని భూమియొక్క వేరువేరు ఖండముల విషయములో ఆయా సమయములందు వేరువేరు ప్రఖ్యానములను చేయ వచ్చును;

అయితే 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద–

భూమి ఆర్జన (సవరణ మరియు శాసనమాన్యమొనర్చు) అధ్యాదేశము, 1967 ప్రారంభమైన తరువాత, అయితే, భూమి ఆర్జన (సవరణ) చట్టము, 1984 ప్రారంభమగుటకు పూర్వము ప్రచురించబడిన అధిసూచనలో చేర్చబడిన ఏదేని భూమి విషయములో ప్రఖ్యానమేదియు, ఆ అధిసూచనను ప్రచురించిన తేదీనుండి మూడు సంవత్సరములు గడచిన తరువాత చేయరాదు, లేక

భూమి ఆర్జన (సవరణ) చట్టము, 1984 ప్రారంభమైన తరువాత ప్రచురించబడిన అధిసూచనలో చేర్చబడిన ఏదేని భూమి విషయములో ప్రఖ్యానమేదియు, ఆ అధిసూచనను ప్రచురించిన తేదీ నుండి ఒక సంవత్సరము గడచిన తరువాత చేయరాదు:

అంతేకాక, అట్టి ఆస్తికొరకు అధినిర్ణయించు నష్టపరిహారమును ఒక కంపెనీ గాని, భాగత: లేక పూర్ణత: పబ్లికు రెవెన్యూల నుండి గాని, ఏదేని ప్రాధికార సంస్థ నియంత్రణలో లేక నిర్వహణలోనున్న ఏదేని నిధినుండి గాని చెల్లించవలసి యున్ననే తప్ప, అట్టి ప్రఖ్యానమేదియు చేయరాదు.

<u>విశదీకరణ 1</u>:– మొదటి వినాయింపులో నిర్దేశించిన కాలావధులలో దేనినైనను సంగణన చేయుటలో, 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద జారీ అయిన అధిసూచన ననుసరించి తీసుకొనవలసిన ఏదేని చర్య లేక ప్రొసీడింగు న్యాయస్థానము ఉత్తరువు ద్వారా నిలుపుదల చేసిన కాలావధిని మినహాయించవలెను.

<u>విశదీకరణ 2</u>.– అట్టి ఆస్తికొరకు అధినిర్ణయించు నష్టపరిహారము రాజ్యము నకు చెందిన లేక రాజ్యము నియంత్రణలోనున్న నిగమము యొక్క నిధుల నుండి చెల్లించవలసినదైనయెడల, అట్టి నష్టపరిహారమును పబ్లికు రెవెన్యూల నుండి చెల్లించ బడిన నష్టపరిహారముగా భావించవలెను.

(2) ప్రతియొక ప్రఖ్యానమును, రాజపత్రములోను ఆ ప్రాంతములో *చలామణిలోనున్న రెండు దినపత్రికలలోను ప్రచురించవలెను – ఆ పత్రికలలో కనీసము ఒకటి ప్రాంతీయ భాషలో ఉండవలెను – కలెక్టరు అట్టి ప్రఖ్యానముయొక్క సారాంశపు పబ్లికు నోటీసును సదరు ప్రాంతములో అనువైన స్థానములో ఇప్పించవలెను (అట్లు ప్రచురించుట మరియు అట్టి పబ్లికు నోటీసు ఇప్పించుట – వీటిలో ఏది చివర జరుగునో దాని తేదీని, ఇందు ఇటు పిమ్మట ప్రఖ్యానపు ప్రచురణ తేదీ అని నిర్దేశించ నైనది). అట్టి ప్రఖ్యానములో, ఆ భూమి ఏ జిల్లాలో లేక ఇతర ప్రాదేశిక డివిజనులో ఉన్నదో అది ఏ ప్రయోజనము కొరకు అవసరమైనది, దాని రమారమి విస్తీర్ణము ఎంత, మరియు ఆ భూమి ప్లాను తయారైనయెడల అట్టి ప్లాను ఎచ్చట తనిఖీ చేయవచ్చునో – ఇవన్నియు తెలుపవలెను.

---

*సర్క్యులేషను.

(3) సదరు ప్రఖ్యానము, ఆ భూమి ఒక సార్వజనిక ప్రయోజనము కొరకు లేక సందర్భానుసారముగ ఒక కంపెనీ కొరకు అవసరమైయున్నదనుటకు నిశ్చాయక సాక్ష్యమైయుండును; అట్టి ప్రఖ్యానమును చేసిన పిమ్మట, సముచిత ప్రభుత్వము ఆ భూమిని ఇందు ఇటు పిమ్మట చెప్పిన – రీతిగా ఆర్జించవచ్చును.

ప్రఖ్యానము చేసిన పిమ్మట కలెక్టరు ఆర్జించుట కొరకు చర్య తీసికొనవలసి యుండుట.

7. ఏదేని భూమి ఒక సార్వజనిక ప్రయోజనము కొరకు గాని, ఒక కంపెనీ కొరకు గాని అవసరమైనదని ప్రఖ్యానించినపుడెల్లను, సముచిత ప్రభుత్వము, లేక ఈ విషయమున సముచిత ప్రభుత్వముచే ప్రాధికారము పొందిన ఎవరేని అధికారి ఆ భూమి ఆర్జన కొరకు చర్య తీసుకొనవలసినదిగా కలెక్టరును ఆదేశించవచ్చును.

భూమికి గుర్తు పెట్టి దాని కొలతలు తీసికొనుట, ప్లాను వేయుట.

8. తదుపరి కలెక్టరు ఆ భూమికి (4వ పరిచ్ఛేదము క్రింద దానికి అదివరకే గుర్తు పెట్టబడియున్ననే తప్ప) గుర్తు పెట్టించవలెను. అతడు దానిని కొలిపించవలెను, మరియు (దాని ప్లాను ఏదియు తయారుకానిచో) దాని ప్లాను తయారు చేయించవలెను.

హితముగల వ్యక్తులకు నోటీసు.

9. (1) అటు తరువాత, కలెక్టరు, ఆ భూమిని ప్రభుత్వము స్వాధీనము చేసుకొనుటకు ఉద్దేశించినదనియు, అట్టి భూమిలోగల హితములన్నిటి కొరకు నష్టపరిహారమునకై తనకు క్లెయిములు చేసుకొనవచ్చుననియు తెలుపుచు అనువైన స్థలములలో లేక తీసుకొనబడు భూమివద్ద లేక దాని సమీపమున సార్వజనిక నోటీసును ఇప్పించవలెను.

(2) అట్టి నోటీసులో, అట్లు అవసరమైన భూమి వివరములను తెలుపవలెను మరియు అందు పేర్కొనిన సమయమునను, (అట్టి సమయము, నోటీసు వెనుక ప్రచురణ తేదీకి పిమ్మట పదునైదు దినముల కంటె ముందుది కాకూడదు) స్థలమునను కలెక్టరు సమక్షమున స్వయముగాగాని, ఏజంటు ద్వారాగాని హాజరుకావలసినదిగా, మరియు ఆ భూమిలో తమతమ హితముల స్వభావమును, అట్టి హితముల కొరకు నష్టపరిహారమునకై తమ క్లెయిముల వివరములను 8వ పరిచ్ఛేదము క్రింద తీసికొనిన కొలతలకు తమ ఆక్షేపణలు (ఏవేని ఉన్నచో) తెలుపవలసినదిగా హితము గల వ్యక్తులందరిని కోరవలెను; ఏ కేసులోనైనను అట్టి వివరణను వ్రాతమూలకముగా తెలుపవలెననియు దానిపై ఆ పక్షకారుగాని, అతని ఏజెంటుగాని సంతకము చేయవలెననియు కలెక్టరు కోరవచ్చును.

(3) కలెక్టరు అట్లని నోటీసును, అట్టి భూమి ఆక్రమణదారు (ఎవరేని ఉన్నచో) అతనికిని, అందు హితముగలవారని, లేక అట్లు హితముగల వ్యక్తుల కొరకు వ్యవహరించుటకు హక్కుగల వారని ఎరిగియున్నవారై లేక విశ్వసింపబడుచున్నవారై ఆ భూమి ఉన్నట్టి రెవిన్యూ జిల్లాలో నివసించుచున్న లేక తామీలును వారి తరఫున స్వీకరించుటకు ప్రాధికారము పొందిన ఏజెంట్లను కలిగిన వ్యక్తులందరికిని కూడ తామీలు చేయవలెను.

(4) అట్లు హితముగల ఏ వ్యక్తియైనను వేరొకచోట నివసించుచుండి అట్టి ఏజెంటునెవరిని కలిగియుండని సందర్భములో, ఆ నోటీసును, జాబులో అతని కడపటి నివాసస్థానమని, ఎరిగియున్నట్టి చిరునామాకు లేక వర్తక స్థలమునకు అతనిని సంబోధించి భారత తపాల కార్యాలయ చట్టము, 1898 యొక్క 28వ మరియు 29వ పరిచ్ఛేదముల క్రింద రిజిస్టరు చేసిన టపా ద్వారా అతనికి పంపవలెను. 1898 లోని 6వ చట్టము.

పేర్లను మరియు హితములను గురించిన వివరణను ఈయవలెనని కోరుటకును అట్లు చేయించుటకును అధికారము.

10. (1) ఆ భూమిలో లేక అందలి ఏదేని భాగములో సహప్రొప్రయిటరుగా, సబ్‌ప్రొప్రయిటరుగా, తాకట్టుదారుగా, కౌలుదారుగా లేక ఇతర విధముగా ఏదేని హితము కలిగియున్న ప్రతి ఇతర వ్యక్తి పేరును మరియు అట్టి హితము స్వభావమును, అట్లు తెలియజేసిన తేదీకి పూర్వపు మూడు సంవత్సరములకు దాని బాబతున పొందిన లేక పొందదగియున్న భాటకములు (రెంట్లు) మరియు లాభములను తెలుపుచు

ఒక వివరణను, పేర్కొనిన సమయమునను (అట్టి సమయము, కోరిన తేదీకి పిమ్మట పదునైదు దినముల కంటె ముందుది కాకూడదు) స్థలమునను తనకు ఈయవలసినదిగా లేక అందజేయవలసినదిగా కలెక్టరు అట్టి వ్యక్తిని కోరవచ్చును.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద గాని 9వ పరిచ్ఛేదము క్రింద గాని వివరములను ఇచ్చుటకు లేక అందజేయుటకు కోరబడిన ప్రతి వ్యక్తియు, భారత శిక్షాస్మృతి యొక్క 175వ, మరియు 176వ పరిచ్ఛేదముల భావపరిధిలో అట్లు చేయుటకు శాసనరీత్యా బద్ధుడైయున్నట్లు భావించవలెను.

<u>కొలతలు, విలువ మరియు క్లెయిములను గుర్తించి కలెక్టరుచే పరిశీలన మరియు అధినిర్ణయము</u>

కలెక్టరుచే పరిశీలన మరియు అధినిర్ణయము.

11. (1) అట్లు నియతము చేయబడిన దినమున, లేక ఆ పరిశీలన ఏ దినమునకు వాయిదా వేయబడినదో ఆ దినమున కలెక్టరు, 9వ పరిచ్ఛేదము క్రింద ఇచ్చిన నోటీసుననుసరించి హితముగల ఏ వ్యక్తియైనను 8వ పరిచ్ఛేదము క్రింద కొలిచిన కొలతలకు తెలిపినట్టి ఆక్షేపణలు (ఏవేని ఉన్నచో) వాటిని గురించియు 4వ పరిచ్ఛేదపు, ఉపపరిచ్ఛేదము (1) క్రింది అధిసూచనయొక్క ప్రచురణ తేదీన భూమి విలువను గురించియు నష్టపరిహారమును క్లెయిముచేయు ఆయా వ్యక్తుల హితములను గురించియు పరిశీలన జరుపుటకు పూనుకొనవలెను మరియు –

(i) భూమియొక్క సరియైన విస్తీర్ణము,

(ii) తన అభిప్రాయములో ఆ భూమికై అనుమతించవలసిన నష్టపరిహారము,

(iii) ఆ భూమిలో హితముగల వారని ఎరిగిన లేక విశ్వసించబడిన ఎవరి క్లెయిములకు సంబంధించి తనకు సమాచారము అందినదో అట్టి వ్యక్తులందరి మధ్య – ఆయా వ్యక్తులు తన సమక్షమున హాజరైనను, కాకున్నను సరే – సదరు నష్టపరిహారపు భాగనిర్ణయమును

గురించి తన తీర్పులో అధినిర్ణయము చేయవలెను.

అయితే, ఈ ఉపపరిచ్ఛేదము క్రింద కలెక్టరు సముచిత ప్రభుత్వము యొక్క లేక సముచిత ప్రభుత్వము ఈ విషయమున ప్రాధికారమొసగినట్టి అధికారి యొక్క పూర్వామోదము లేకుండ ఎట్టి అధినిర్ణయము చేయరాదు:

అంతేకాక, సముచిత ప్రభుత్వము ఈ విషయమున నిర్దిష్టపరచునట్టి కోవకు చెందిన కేసులలో కలెక్టరు అట్టి ఆమోదము పొందకుండనే ఆ అధినిర్ణయము చేయవచ్చునని ఆదేశించుటకు సముచిత ప్రభుత్వమునకు సమర్థత ఉండును.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, సముచిత ప్రభుత్వము చేసిన నియమముల ద్వారా విహితపరచిన ప్రరూపములో కలెక్టరు అధినిర్ణయములో చేర్చవలసిన విషయములన్నిటిపై, తన సమక్షమున హాజరైనట్టి భూమిలో హితముగల వ్యక్తులందరు, కరారు చేసికొనినవారని చర్యలయొక్క ఏ దశయందైనను కలెక్టరు తృప్తి చెందినచో అతడు, ఇంకెట్టి పరిశీలన జరుపకుండనే, అట్టి కరారు నిబంధనలననుసరించి అధినిర్ణయము చేయవచ్చును,

(3) ఉపపరిచ్ఛేదము (2) క్రింద ఏదేని భూమికొరకు చేసిన నష్టపరిహారపు నిర్ధారణ, అదే ప్రాంతములోగాని వేరొక చోటగాని ఇతర భూముల విషయములో ఈ చట్టములోని ఇతర నిబంధనల ననుసరించి నష్టపరిహారమును నిర్ధారణ చేయుటకు ఏ విధముగను భంగము కలిగించదు.

(4) రిజిస్ట్రీకరణ చట్టము, 1908లో ఏమియున్నప్పటికిని, ఉపపరిచ్ఛేదము (2) క్రింద చేసికొనిన కరారు ఏదియు, ఆ చట్టము క్రింద రిజిస్ట్రీకరణకు లోనుకాదు. 1908 లోని 16వ చట్టము.

11ఏ. ప్రఖ్యానము యొక్క ప్రచురణ తేదీనుండి రెండు సంవత్సరముల కాలావధి లోపల 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయము చేయవలెను. ఆ కాలావధి లోపల అధినిర్ణయమేదియు చేయబడనిచో ఆ భూమి అర్జనకొరకైన సమస్త చర్యలు వ్యపగతమగును: అధినిర్ణయమును ఎంత కాలావధి లోపల చేయవలెను.

అయితే, సదరు ప్రఖ్యానము, భూమి అర్జన (సవరణ) చట్టము, 1984 ప్రారంభమగుటకు పూర్వము ప్రచురించబడిన సందర్భములో, ఆ అధినిర్ణయమును అట్టి ప్రారంభము నుండి రెండు సంవత్సరముల కాలావధిలోపల చేయవలెను.

<u>విశదీకరణ</u>:– ఈ పరిచ్ఛేదములో నిర్దేశించిన రెండు సంవత్సరముల కాలావధిని సంగణన చేయుటలో, సదరు ప్రఖ్యానము ననుసరించి తీసుకొనవలసిన ఏదేని చర్య లేక ప్రొసీడింగు న్యాయస్థానము ఉత్తరువు ద్వారా నిలుపుదల చేసిన కాలావధిని మినహాయించవలెను.

12. (1) అట్టి అధినిర్ణయమును కలెక్టరు కార్యాలయములో ఫైలు చేయవలెను. మరియు ఆ నిర్ణయము ఇందు ఇటు పిమ్మట నిబంధించినట్లు తప్ప, భూమి యొక్క వాస్తవ విస్తీర్ణము, విలువ మరియు హితముగల వ్యక్తుల మధ్య నష్ట పరిహారము యొక్క భాగనిర్ణయమును గురించి కలెక్టరుకును, హితముగల వ్యక్తులకును మధ్య ఆయా వ్యక్తులు కలెక్టరు సమక్షమున హాజరైనను, కాకున్నను – అంతిమమై, నిశ్చాయకమైన సాక్ష్యమగును. కలెక్టరు అధినిర్ణయము ఎప్పుడు అంతిమమైనదగును.

(2) కలెక్టరు, అధినిర్ణయము చేసినపుడు స్వయముగా గాని ప్రతినిధి ద్వారాగాని హాజరుకానట్టి హితముగల వ్యక్తులకు తన అధినిర్ణయపు నోటీసును వెంటనే ఈయవలెను.

13. కలెక్టరు, తాను సబబని తలచునట్టి ఏదేని కారణము వలన, ఆయా సమయములందు పరిశీలనను, తాను నియతము చేయునట్టి దినమునకు వాయిదా వేయవచ్చును. పరిశీలనను వాయిదావేయుట.

13ఏ. (1) కలెక్టరు, ఎప్పుడైనను, కాని అధినిర్ణయపు తేదీనుండి ఆరు మాసములు దాటకుండ, లేక 18వ పరిచ్ఛేదము క్రింద న్యాయస్థానమునకు నిర్దేశించవలెనని అతనిని కోరినయెడల, అట్టి నిర్దేశము చేయుటకు పూర్వము తనంతతానుగాని ఎవరేని హితముగల వ్యక్తి లేక ఏదేని ప్రాధికార సంస్థ దరఖాస్తు పెట్టుకొనిన మీదట గాని ఉత్తరువు ద్వారా, అధినిర్ణయములోగల ఏవేని వ్రాతపరమైన తప్పులను లేక లెక్కలకు సంబంధించిన తప్పులను లేక అందులో ఏర్పడు పొరపాట్లను సరిదిద్దవచ్చును: వ్రాతపరమైన తప్పులు మొదలైన వాటిని సరిదిద్దుట.

అయితే, ఎవరేని వ్యక్తికి ప్రతికూలముకాగల ఎట్టి దిద్దుబాటును గాని, ఆ విషయములో విన్నపము చేసుకొనుటకు అట్టి వ్యక్తికి యుక్తమైన అవకాశము నిచ్చిననే తప్ప, చేయరాదు.

(2) కలెక్టరు, ఆ అధినిర్ణయములో చేసిన ఏదేని దిద్దుబాటును గురించి హితముగల వ్యక్తులందరికి వెంటనే నోటీసు నీయవలెను.

(3) ఉపపరిచ్ఛేదము (1) క్రింద చేసిన దిద్దుబాటు ఫలితముగా ఎవరేని వ్యక్తికి ఏదేని హెచ్చు మొత్తము చెల్లించినట్లు, రుజువైనయెడల, అట్లు చెల్లించిన హెచ్చు మొత్తమును వాపసు చేయవలసియుండును, దానిని చెల్లించనియెడల లేక చెల్లించుటకు నిరాకరించినయెడల, దానిని భూమి శిస్తు బకాయివలె వసూలు చేయవచ్చును.

సాక్షులను సమను చేయుటకును మరియు వారు హాజరగునట్లును దస్తావేజులను దాఖలుచేయునట్లును చేయుటకు అధికారము.

14. ఈ చట్టము క్రింద పరిశీలనలు జరుపు నిమిత్తము కలెక్టరు, సివిలు ప్రక్రియా స్మృతి 1908 (1908 లోని 5వ చట్టము) క్రింద ఒక సివిలు న్యాయ స్థానము విషయములో నిబంధించినట్టి పద్ధతుల ద్వారానే మరియు (వీలైనంత మేరకు) అట్టి రీతిగానే, హితముగల వ్యక్తులతో సహా సాక్షులను లేక వారిలో ఎవరి నైనను సమనుచేసి వారు హాజరగునట్లు, మరియు దస్తావేజులను తప్పనిసరిగా దాఖలు చేయునట్లు చేయుటకు అధికారము కలిగియుండును.

పర్యాలోచించవలసిన మరియు ఉపేక్షించవలసిన విషయములు.

15. నష్టపరిహారమొత్తమును నిర్ధారణ చేయుటలో కలెక్టరు, 23వ మరియు 24వ పరిచ్ఛేదములలోని నిబంధనలను పాటించవలెను.

రికార్డులు మొదలైనవి తెప్పించుటకు అధికారము.

15ఏ. 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయము చేయుటకు పూర్వము ఎప్పుడైనను, సముచిత ప్రభుత్వము, ఏవేని చర్యల (ప్రొసీడింగుల)కు సంబంధించిన ఏదేని రికార్డును, (పరిశీలన రూపముదైనను ఇతరమైనదైనను) అందు ఒసగిన ఏదేని నిశ్చయము లేక ఉత్తరువు యొక్క శాసనబద్ధతను లేక ఔచిత్యమును గురించి లేక అట్టి చర్యల క్రమబద్ధతను గురించి తృప్తిచెందుటకై తెప్పించుకొనవచ్చును మరియు దానికి సంబంధించి తాము సబబని తలచునట్టి ఉత్తరువును చేయవచ్చును, లేక అట్టి ఆదేశమును జారీచేయవచ్చును:

అయితే, సముచిత ప్రభుత్వము, ఏ వ్యక్తికైనను ఆకర్ణింపబడుటకై అవ కాశము నొసగకుండ అతనికి ప్రతికూలముగ ఏ ఉత్తరువును గాని చేయరాదు, ఏ ఆదేశమును గాని జారీచేయరాదు.

## స్వాధీనము చేసికొనుట

స్వాధీనము చేసికొనుటకు అధికారము.

16. 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయము చేసినపుడు, అతడు ఆ భూమిని స్వాధీనము చేసికొనవచ్చును, తదుపరి అది సకల అభిభారరహితముగా ప్రభుత్వమునందు సంపూర్ణముగా నిహితమగును.

అత్యవసర సందర్భములలో ప్రత్యేక అధికారములు.

17. (1) అత్యవసర సందర్భములలో సముచిత ప్రభుత్వము ఆదేశించినపు డెల్లను కలెక్టరు, అట్టి అధినిర్ణయమేదియు చేయబడనప్పటికిని, 9వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లో తెలిపిన నోటీసును ప్రచురించినప్పటి నుండి పదునైదు దినములు గడచిన మీదట, సార్వజనిక ప్రయోజనము కొరకు అవసరమైన ఏదేని భూమిని స్వాధీనము చేసుకొనవచ్చును; తదుపరి అట్టి భూమి సకల అభిభారరహితముగ ప్రభుత్వమునందు సంపూర్ణముగా నిహితమగును.

(2) ఏదేని నౌకాయాన యోగ్యమైన నదీ ప్రవాహము హఠాత్తుగా మారినందు వలన లేక ముందుగా ఊహించని అత్యవసర పరిస్థితి వలన ఏదేని రైల్వే పాలక వర్గము దాని ట్రాఫికు నిర్వహణకు లేక ఏదేని నదీతీరపు లేక ఘాట్ స్టేషనును దానిపై నెలకొల్పు టకు లేక ఏదేని అట్టి స్టేషనులో సుకరమైన కనెక్షను లేక దానిని చేరు ఏర్పాటు చేయుటకు ఏదేని భూమి స్వాధీనమును తక్షణమే ఆర్జించుట అవసరమైనపుడెల్లను లేక నీటిపారుదల, నీటిసరఫరా, మురుగునీటిపారుదల, (డ్రయినేజి) రోడ్డు కమ్యూనికేషను లేక విద్యుచ్ఛక్తి - వీటికి సంబంధించిన ఏదేని నిర్మాణమును లేక వ్యవస్థను నిర్వహించు ప్రయోజనము కొరకు ఏదేని భూమి స్వాధీనమును తక్షణమే ఆర్జించుట అవసరమని సముచిత ప్రభుత్వము భావించినపుడెల్లను కలెక్టరు, ఉపపరిచ్ఛేదము (1)లో తెలిపిన నోటీసును ప్రచురించిన పిమ్మట వెంటనే మరియు సముచిత ప్రభుత్వపు పూర్వ మంజూరీతో అట్టి భూమిపై ప్రవేశించి దానిని స్వాధీనము చేసుకొనవచ్చును; తదుపరి అది సకల అభిభారరహితముగ ప్రభుత్వమునందు సంపూర్ణముగా నిహితమగును:

అయితే కలెక్టరు, ఈ ఉపపరిచ్ఛేదము క్రింద ఏదేని భవనమునుగాని, భవనమునందలి భాగమునుగాని, దానిని స్వాధీనము చేసుకొనుటకు తనకు గల ఉద్దేశమును తెలుపుచు నలుబది ఎనిమిది గంటల నోటీసు, లేక దాని ఆక్రమణదారు అట్టి భవనము నుండి తన చరాస్తిని అనవసరమైన ఇబ్బందులకు లోనుకాకుండ తొలగించుటకు వీలుండునట్లు యుక్తముగా సరిపోవునంత దీర్ఘకాలపు నోటీసును దాని ఆక్రమణదారుకు ఈయకుండ, స్వాధీనము చేసుకొనరాదు.

(3) పై రెండు ఉపపరిచ్ఛేదములలో దేనిక్రిందనైనను ప్రతి కేసులో కలెక్టరు, స్వాధీనము చేసుకొనునపుడు, హితముగల వ్యక్తులకు, అట్టి భూమిపై పైరుల (ఏవేని ఉన్నచో) వాటికొరకును మరియు అట్లు హఠాత్తుగా తొలగించబడినందువలన వారికి కలిగిన, 24వ పరిచ్ఛేదములో వినాయించని ఏదేని ఇతర చెరుపు కొరకును నష్టపరిహారమునివ్వజూపవలెను; అట్లు ఇవ్వజూపినది స్వీకరించనిచో, ఇందలి నిబంధనల క్రింద ఆ భూమికొరకు నష్టపరిహారమును అధినిర్ణయించుటలో అట్టి పైరుల మరియు చెట్లయొక్క విలువను మరియు అట్టి ఇతర చెరుపు మొత్తమును పరిగణలోనికి తీసికొనవలెను.

(3ఏ) ఉపపరిచ్ఛేదము (1) లేక ఉపపరిచ్ఛేదము (2) క్రింద ఏదేని భూమిని స్వాధీనము చేసుకొనుటకు పూర్వము కలెక్టరు, ఉపపరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలకు భంగము లేకుండ–

(ఏ) అట్టి భూమికొరకు తాను అంచనా వేసినట్లు నష్టపరిహారములో ఎనుబది శాతము, దానికి హక్కుకలిగి హితముగల వ్యక్తులకు చెల్లింపజూపవలెను, మరియు

(బీ) 31వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)లో పేర్కొనిన ఆకస్మికతలలో ఏదేని ఒక దాని వలన లేక ఒకటి కంటె ఎక్కువ వాటి వలన నివారింపబడిననే తప్ప, వారికి చెల్లించవలెను,

మరియు కలెక్టరు అట్లు నివారింపబడినయెడల, 31వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) యొక్క నిబంధనలు, (దానికి గల రెండవ వినాయింపు తప్ప), ఆ పరిచ్ఛేదము క్రింద నష్టపరిహారమును చెల్లించుటకు వర్తించునట్లుగనే వర్తించును.

(3బీ) ఉపపరిచ్ఛేదము (3ఏ) క్రింద చెల్లించిన లేక డిపాజిటు చేసిన మొత్తమును, 31వ పరిచ్ఛేదము క్రింద చెల్లింపజూపవలసిన నష్టపరిహారపు మొత్తమును నిర్ధారణ చేయుట కొరకు లెక్కలోనికి తీసికొనవలెను; అట్లు చెల్లించిన లేక డిపాజిటు చేసిన మొత్తము 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయించిన నష్టపరిహారమునకు మించిన యెడల, ఆ మించిన మొత్తమును, కలెక్టరు అధినిర్ణయపు తేదీ నుండి మూడు మాసములలోపల వాపసు చెల్లించిననే తప్ప, దానిని భూమిశిస్తు బకాయివలెనే వసూలు చేయవచ్చును.

(4) సముచిత ప్రభుత్వము అభిప్రాయములో ఉపపరిచ్ఛేదము (1) లేక ఉపపరిచ్ఛేదము (2) యొక్క నిబంధనలు వర్తించునట్టి ఏదేని భూమి విషయములో పరిచ్ఛేదము 5ఏ యొక్క నిబంధనలు వర్తించవని సముచిత ప్రభుత్వము ఆదేశించవచ్చును; ఆ ప్రభుత్వము అట్లు ఆదేశించినచో, ఆ భూమికి సంబంధించి 6వ పరిచ్ఛేదము క్రింద ప్రఖ్యానమును, 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద అధిసూచన ప్రచురణ తేదీకి పిమ్మట ఎప్పుడైనను చేయవచ్చును.

## భాగము 3

## న్యాయస్థానమునకు నిర్దేశము; తదుపరి ప్రక్రియ

న్యాయస్థానమునకు నిర్దేశము.

18. (1) అధినిర్ణయమును స్వీకరించనట్టి హితముగల ఏ వ్యక్తియైనను, కలెక్టరుకు వ్రాతమూలకముగా దరఖాస్తు పెట్టుకొని అతని ఆక్షేపణ భూమి కొలతను, నష్టపరిహారపు మొత్తమును, దానిని చెల్లించవలసిన వ్యక్తులను గురించినదైనను లేక హితముగల వ్యక్తుల మధ్య నష్టపరిహారపు భాగనిర్ణయమును గురించినదైనను - కలెక్టరు ఆ విషయమును, నిర్ధారణ కొరకు న్యాయస్థానమునకు నిర్దేశించవలెనని కోరవచ్చును.

(2) అధినిర్ణయమునకు ఆక్షేపణ ఏ ఆధారములపై చేయబడినదో ఆ దరఖాస్తులో తెలుపవలెను:

అయితే అట్టి ప్రతి దరఖాస్తును-

(ఏ) దరఖాస్తు పెట్టుకొను వ్యక్తి స్వయముగా గాని ప్రతినిధి ద్వారా గాని కలెక్టరు సమక్షమున అధినిర్ణయము నొసగినపుడు హాజరైయున్నచో, కలెక్టరు అధినిర్ణయపు తేదీనుండి ఆరువారములలోపల,

(బీ) ఇతర సందర్భములలో, 12వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింద కలెక్టరు నుండి నోటీసు అందిన ఆరు వారముల లోపల, లేక కలెక్టరు అధినిర్ణయపు తేదీ నుండి ఆరు మాసముల లోపల, వీటిలో ఏది ముందు ముగియునో ఆ కాలావధి లోపల-

పెట్టుకొనవలెను.

కలెక్టరు న్యాయస్థానమునకు వివరించుట.

19. (1) నిర్దేశము చేయుటలో కలెక్టరు తన చేవ్రాలుతో వ్రాతమూలకముగా, న్యాయస్థానమునకు తెలియజేయు నిమిత్తము-

(ఏ) భూమిపై గల ఏవేని చెట్లు, భవనములు లేక పైర్ల వివరములతో ఆ భూమి ఉనికిని విస్తీర్ణమును,

(బీ) అట్టి భూమిలో హితముగల వారని తాను తలచుటకు కారణమున్నట్టి వ్యక్తుల పేర్లను,

(సీ) చెరుపు కొరకు 5వ మరియు 17వ పరిచ్ఛేదముల క్రింద లేక ఆ రెంటిలో దేనిక్రిందనైనను అధినిర్ణయింపబడి చెల్లింపబడిన, లేక చెల్లింపజూపబడిన మొత్తము, మరియు 11వ పరిచ్ఛేదము క్రింద అధినిర్ణయింపబడిన నష్టపరిహారపు మొత్తమును,

(సీసీ) 17వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (3ఏ) క్రింద చెల్లింపబడిన లేక డిపాజిటు చేయబడిన మొత్తము, మరియు

(డీ) ఆక్షేపణ, నష్టపరిహారపు మొత్తమును గురించినదైనచో, నష్టపరిహారపు మొత్తము ఏ ఆధారములపై నిర్ధారణ చేయబడినదో వాటిని-

వివరించవలెను.

(2) సదరు వివరణకు హితముగల ఆయా వ్యక్తులకు తామేలుచేసిన నోటీసుల యొక్కయు వారు వ్రాతమూలకముగా ఇచ్చిన లేక అందజేసిన వివరములను తెలుపుచు ఒక అనుసూచిని జతచేయవలెను.

**నోటీసుయొక్క తామీలు.**

20. తదుపరి న్యాయస్థానము ఆ ఆక్షేపణను నిర్ధారణ చేయుటకు పూనుకొను దినమును నిర్దిష్టపరచునను ఆ దినమున వారు న్యాయస్థానమునకు హాజరుకావలెనని ఆదేశించుచును ఒక నోటీసును న్యాయస్థానము ఈ క్రింది వ్యక్తులకు తామీలు చేయించవలెను, వారెవరనగా:-

(ఏ) దరఖాస్తుదారు;

(బీ) అధినిర్ణయింపబడిన నష్టపరిహారపు చెల్లింపును పొందుటకు అభ్యంతరము లేకుండ సమ్మతించినట్టి వారు (ఎవరేని ఉన్నచో) వారు తప్ప, ఆ ఆక్షేపణలో హితముగల వ్యక్తులందరు;

(సీ) ఆ ఆక్షేపణ భూమి విస్తీర్ణమును, లేక నష్టపరిహారపు మొత్తమును గురించినదైనచో, కలెక్టరు.

**చర్యల పరిధిపై నిర్బంధన.**

21. అట్టి ప్రతియొక చర్యలోను పరిశీలనా పరిధి ఆ ఆక్షేపణ వలని ప్రభావమునకు గురియైన వ్యక్తుల హితములను పర్యాలోచించుటకు మాత్రమే పరిమితమై యుండును.

**చర్యలను న్యాయస్థానములో బహిరంగముగా జరుపవలసి యుండుట.**

22. అట్టి ప్రతియొక చర్యను న్యాయస్థానములో బహిరంగముగా జరుపవలెను, రాజ్యమునందలి ఏ సివిలు న్యాయస్థానములోనైనను న్యాయవాద వృత్తి చేయుటకు హక్కుగల వ్యక్తులందరికి, అట్టి చర్యలలో (సందర్భానుసారముగ) హాజరగుటకు, న్యాయవాదిత్వమును చేపట్టుటకు మరియు న్యాయవాదిగా వ్యవహరించుటకు హక్కు ఉండును.

**నష్టపరిహారమును నిర్ధారణచేయుటలో పర్యాలోచింప వలసిన విషయములు.**

23. (1) ఈ చట్టము క్రింద ఆర్జించిన భూమికొరకు అధినిర్ణయించవలసిన నష్టపరిహారపు మొత్తమును నిర్ధారణ చేయుటలో న్యాయస్థానము ఈ క్రింది వాటిని పర్యాలోచించవలెను:--

<u>మొదటిది</u>:-4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద అధిసూచన ప్రచురణ తేదీన ఆ భూమికి గల మార్కెటు విలువ;

<u>రెండవది</u>:- భూమిని కలెక్టరు స్వాధీనము చేసికొనినపుడు ఆ భూమిపై గల పైర్లు లేక చెట్లు తీసికొనబడినందువలన, హితముగల వ్యక్తికి కలిగిన చెరుపు;

<u>మూడవది</u>:- భూమిని కలెక్టరు స్వాధీనము చేసికొనినపుడు, ఆ భూమిని, హితముగల వ్యక్తియొక్క ఇతర భూమి నుండి వేరు చేసినందువలన అతనికి కలిగిన చెరుపు; (ఏదేని ఉన్నచో)

<u>నాల్గవది</u>:- భూమిని కలెక్టరు స్వాధీనము చేసికొనినపుడు, ఆ అర్జన మూలముగా హితముగల వ్యక్తియొక్క ఇతర ఆస్తి - అది చరాస్తియైనను, స్థిరాస్తియైనను - ఏదేని ఇతర విధముగా గాని లేక అతని సంపాదనలు గాని హానికరమైన ప్రభావమునకు గురియైనందువలన అతనికి కలిగిన చెరుపు; (ఏదేని ఉన్నచో)

<u>అయిదవది</u>:- భూమిని కలెక్టరు ఆర్జించిన పరిణామముగ, హితముగల వ్యక్తి తన నివాసమును లేక వర్తక స్థలమును మార్చుట తప్పనిసరియైనచో, అట్టి మార్పుకు ఆనుషంగికమైనట్టి యుక్తమైన వ్యయములు; (ఏదేని ఉన్నచో)

<u>ఆరవది</u>:- 6వ పరిచ్ఛేదము క్రింద ప్రఖ్యానమును ప్రచురించినప్పటి నుండి భూమిని కలెక్టరు స్వాధీనము చేసుకొను వరకు భూమి లాభములు తగ్గిన ఫలితముగా కలిగిన యదార్థమైన చెరుపు. (ఏదేని ఉన్నచో)

(1ఏ) ప్రతి కేసులోను న్యాయస్థానము, పైన నిబంధించినట్లు భూమియొక్క మార్కెటు విలువకు అదనముగా, అట్టి భూమి విషయములో 4వ పరిచ్ఛేదపు ఉప పరిచ్ఛేదము (1) క్రింద అధిసూచన యొక్క ప్రచురణ తేదీన ప్రారంభమై మరియు ఆ తేదీనుండి కలెక్టరు అధినిర్ణయపు తేదీ లేక భూమిని స్వాధీనము చేసుకొనిన తేదీ — వీటిలో ఏది ముందో ఆ తేదీ వరకు గల కాలావధికి, అట్టి మార్కెటు విలువపై సంవత్సరమునకు పండ్రెండు శాతము రేటు చొప్పున లెక్కకట్టి మొత్తమును అధినిర్ణయించ వలెను;

విశదీకరణము:- ఈ ఉపపరిచ్ఛేదములో నిర్దేశించిన కాలావధిని సంగణన చేయుటలో ఏదేని న్యాయస్థానము ఉత్తరువు ద్వారా ఇచ్చిన ఏదేని నిలుపుదల లేక వ్యాదేశము కారణముగా భూమి అర్జన చర్యలు ఆగిపోయినట్టి ఏదేని కాలావధిని లేక ఏవేని కాలావధులను మినహాయించవలెను.

(2) ప్రతి కేసులోను న్యాయస్థానము, పైన నిబంధించినట్లు భూమి యొక్క మార్కెటు విలువకు అదనముగా, ఆ అర్జన తప్పనిసరిగా చేయువలసినటువంటిదైనందుకు ప్రతిఫలముగా, అట్టి మార్కెటు విలువపై ముప్పది శాతము పైకమును అధినిర్ణ యించవలెను.

నష్టపరిహారమును నిర్ధారణచేయుటలో ఉపేక్షించవలసిన విషయములు.

24. కాని న్యాయస్థానము ఈ క్రింది విషయములను పర్యాలోచించరాదు:-

మొదటిది:- అర్జనకు దారితీసినట్టి అత్యవసర పరిస్థితి ఏపాటిది.

రెండవది:- అర్జించిన భూమిని వదలుకొనుటకు హితముగల వ్యక్తియొక్క ఏదేని అయిష్టత.

మూడవది:- అతనికి కలిగిన ఏదేని చెరుపు - అది ఒక ప్రయివేటు వ్యక్తి కలిగించియుండినదో అందుకై అట్టి వ్యక్తిపై దావా వేయుజాలనిదైనదో;

నాల్గవది:- అర్జించిన భూమికి, 6వ పరిచ్ఛేదము క్రింద ప్రఖ్యానము యొక్క ప్రచురణ తేదీకి పిమ్మట, అది దేనిపై ఉపయోగించబడునో దాని ద్వారా లేక తత్పరిణామముగా బహుశః కలుగగల ఏదేని చెరుపు;

అయిదవది:- అర్జించిన మీనట భూమి దేనికై ఉపయోగించబడునో దాని మూలముగా ఆ అర్జించిన భూమి విలువలో బహుశః కాగల ఏదేని పెరుగుదల;

ఆరవది:- అర్జించిన భూమి దేనికై ఉపయోగించబడునో దాని మూలముగా, హితముగల వ్యక్తికి చెందిన ఇతర భూమియొక్క విలువలో బహుశః కాగల ఏదేని పెరుగుదల;

ఏడవది:-అర్జించిన భూమిపై, 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద అధిసూచనయొక్క ప్రచురణ తేదీకి పిమ్మట కలెక్టరు మంజూరు లేకుండ ప్రారంభించిన, చేసిన లేక క్రియాన్వితము చేసిన ఏదేని పరివ్యయము లేక అభివృద్ధి, లేక అట్టి భూమి యొక్క వ్యయనము; లేక

ఎనిమిదవది:-భూమిని శాసనరీత్యా నిషేధింపబడిన లేక సార్వజనిక *విధానమునకు విరుద్ధముగ ఉపయోగించినందువలన దాని విలువలో కలిగిన ఏదేని పెరుగుదల.

న్యాయస్థానము అధినిర్ణయించిన నష్టపరిహారపు మొత్తము కలెక్టరు అధినిర్ణయించిన మొత్తము కంటె తక్కువ ఉండరాదు.

25. న్యాయస్థానము అధినిర్ణయించిన నష్టపరిహారపు మొత్తము 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయించిన మొత్తమున కంటె తక్కువ ఉండరాదు.

---

*పాలసీ.

*అధినిర్ణయముల ప్రరూపము.*

26. (1) ఈ భాగము క్రింది ప్రతి అధినిర్ణయము వ్రాతమూలకముగా ఉండవలెను దానిపై న్యాయాధీశుడు సంతకము చేయవలెను; అందు 23వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) యొక్క మొదటి ఖండము క్రింద అధినిర్ణయించిన మొత్తమును మరియు సదరు ఉప-పరిచ్ఛేదము యొక్క ఇతర ఖండములలో వరుసగా ప్రతిదాని క్రింద అధినిర్ణయించిన మొత్తములు ఏవేని ఉన్నచో వాటిని కూడ, ఆ ప్రతియొక మొత్తమును అధినిర్ణయించుటకుగల ఆధారములతో సహా నిర్దిష్టపరచవలెను.

*1908 లోని 5వ చట్టము.*

(2) సివిలు ప్రక్రియా స్మృతి, 1908 యొక్క 2వ పరిచ్ఛేదములోని, ఖండము (2) మరియు 2వ పరిచ్ఛేదములోని, ఖండము (9) భావపరిధిలో వరుసగా అట్టి ప్రతి అధినిర్ణయము డిక్రీగాను మరియు అట్టి ప్రతియొక అధినిర్ణయమునకు గల ఆధారముల వివరణను తీర్పుగాను భావించవలెను.

*ఖర్చులు.*

27. (1) అట్టి ప్రతియొక అధినిర్ణయము, ఈ భాగము క్రింది చర్యలకైన ఖర్చుల మొత్తమును మరియు వాటిని ఏ వ్యక్తులు ఏ అనుపాతములలో చెల్లించవలెనను దానిని కూడ వివరించవలెను.

(2) కలెక్టరు ఒసగిన అధినిర్ణయము నిలువనప్పుడు దరఖాస్తుదారు చేసిన క్లెయిము మిక్కిలి అత్యధికముగా ఉండినందున లేక అతడు తన కేసును కలెక్టరు సమక్షమున ఉంచుటలో చాల ఉపేక్ష చేసినందున, అతని ఖర్చులలో కొంత తగ్గింపు చేయవలెనని లేక కలెక్టరు ఖర్చులలో కొంత భాగమును అతడు చెల్లించవలెనని న్యాయస్థానము అభిప్రాయపడిననే తప్ప మామూలుగా కలెక్టరు ఖర్చులను చెల్లించవలెను.

*హెచ్చు నష్టపరిహారముపై వడ్డీ చెల్లించవలసినదిగ కలెక్టరును ఆదేశించవచ్చును.*

28. నష్టపరిహారముగా అధినిర్ణయించిన పైకమున కంటె హెచ్చు పైకమును కలెక్టరు నష్టపరిహారముగా అధినిర్ణయించియుండవలసినదని న్యాయస్థానము అభిప్రాయపడినచో, అతడు భూమిని స్వాధీనము చేసుకొనిన తేదీనుండి అట్టి హెచ్చు పైకమును న్యాయస్థానములో చెల్లించు తేదీ వరకు సంవత్సరమునకు తొమ్మిది శాతము రేటు చొప్పున అట్టి హెచ్చు పైకముపై వడ్డీని కలెక్టరు చెల్లించవలెనని న్యాయస్థానము అధినిర్ణయములో ఆదేశించవచ్చును:

అయితే అట్టి హెచ్చు పైకమును లేక అందలి ఏదేని భాగమును, భూమి స్వాధీనము చేసుకొనబడిన తేదీ నుండి ఒక సంవత్సరము కాలావధి ముగిసిన తేదీకి పిమ్మట చెల్లించినయెడల, అట్టి హెచ్చు మొత్తముపై, లేక అట్టి కాలావధి ముగిసిన తేదీకి పూర్వము న్యాయస్థానములో చెల్లించక మిగిలియున్న అందలి భాగముపై సదరు ఒక సంవత్సరము కాలావధి ముగిసిన తేదీ నుండి సంవత్సరమునకు పదునైదు శాతము రేటు చొప్పున వడ్డీ చెల్లించవలెనని కూడ న్యాయస్థానము అధినిర్ణయములో ఆదేశించవచ్చును.

*న్యాయస్థానము యొక్క అధినిర్ణయము ప్రాతిపదికపై నష్టపరిహారపు మొత్తమును తిరిగి నిర్ధారణ చేయుట.*

28ఏ. (1) ఈ భాగము క్రింది ఏదేని అధినిర్ణయములో న్యాయస్థానము దరఖాస్తుదారుకు, 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు అధినిర్ణయించిన మొత్తమున కంటె హెచ్చు నష్టపరిహారపు మొత్తమును అనుమతించినయెడల, 4వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) క్రింద ఒకే అధిసూచనలో చేర్చబడినట్టి ఇతర భూములన్నింటిలో హితము కలిగినవారైయుండి, కలెక్టరు చేసిన అధినిర్ణయము వలన వ్యథితులైనట్టి వ్యక్తులు కూడ, 18వ పరిచ్ఛేదము క్రింద వారు కలెక్టరుకు దరఖాస్తు పెట్టుకొని యుండనప్పటికిని, న్యాయస్థానము యొక్క అధినిర్ణయపు తేదీ నుండి మూడు మాసముల లోపల కలెక్టరుకు వ్రాతమూలకముగా దరఖాస్తు పెట్టుకొని, వారికి చెల్లింపదగిన నష్టపరిహారపు మొత్తమును న్యాయస్థానము అధినిర్ణయించిన నష్టపరిహారపు మొత్తము యొక్క ప్రాతిపదికపై తిరిగి నిర్ధారణ చేయవలెనని కోరవచ్చును:

అయితే, ఈ ఉపపరిచ్ఛేదము క్రింద కలెక్టరుకు దరఖాస్తు పెట్టుకొనవలసిన మూడు మాసముల కాలావధిని సంగణన చేయుటలో అధినిర్ణయమును చెప్పిన తేదీని మరియు ఆ అధినిర్ణయపు నకలును పొందుటకు ఆవశ్యకమైన కాలమును మినహాయించవలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద దరఖాస్తు అందిన మీదట కలెక్టరు, హితముగల వ్యక్తులందరికి నోటీసునిచ్చిన పిమ్మటను ఆకర్ణింపబడుటకు వారికి అవకాశము నొసగిన పిమ్మటను పరిశీలన జరిపి, దరఖాస్తుదారులకు చెల్లింపదగు నష్టపరిహారపు మొత్తమును నిర్ధారణ చేయుచు అధినిర్ణయము చేయవలెను.

(3) ఉపపరిచ్ఛేదము (2) క్రింద అధినిర్ణయమును స్వీకరించని ఏ వ్యక్తియైనను, కలెక్టరుకు వ్రాతమూలకముగ దరఖాస్తు పెట్టుకొని, ఆ విషయమును కలెక్టరు నిర్ధారణ కొరకై న్యాయస్థానమునకు నిర్దేశించవలెనని కోరవచ్చును; అట్టి నిర్దేశమునకు, 18 నుండి 28 వరకు గల పరిచ్ఛేదముల నిబంధనలు 18వ పరిచ్ఛేదము క్రింది నిర్దేశమునకు వర్తించునట్లుగనే వర్తించును.

## భాగము 4

## నష్టపరిహారము యొక్క భాగనిర్ణయము

భాగనిర్ణయపు వివరములను నిర్దిష్టపరచుట.

29. హితముగల వ్యక్తులు పెక్కు మంది ఉన్నయెడల, వారు నష్టపరిహారపు భాగనిర్ణయములో ఏకీభావము కలిగియున్నచో, అట్టి భాగనిర్ణయపు వివరములను అధినిర్ణయములో నిర్దిష్టపరచవలెను. మరియు అట్టి వ్యక్తుల మధ్య ఆ భాగనిర్ణయము సరియైనదనుటకు ఆ అధినిర్ణయము నిశ్చాయకమైన సాక్ష్యముగా ఉండవలెను.

భాగనిర్ణయమును గూర్చిన వివాదము.

30. 11వ పరిచ్ఛేదము క్రింద నష్టపరిహారపు మొత్తమును నిర్ణయించినపుడు, దాని యొక్క లేక అందలి ఏదేని భాగము యొక్క భాగనిర్ణయమును గూర్చి, లేక దానిని లేక దాని ఏదేని భాగమును ఏ వ్యక్తులకు చెల్లించవలసియుండును అను దానిని గూర్చి ఏదేని వివాదము ఉత్పన్నమైనపుడు, కలెక్టరు అట్టి వివాదమును నిర్ణయము కొరకై న్యాయస్థానమునకు నిర్దేశించవచ్చును.

## భాగము 5

## చెల్లింపు

నష్టపరిహారమును చెల్లించుట, లేక దానిని న్యాయస్థానములో డిపాజిటు చేయుట.

31. (1) 11వ పరిచ్ఛేదము క్రింద అధినిర్ణయము చేసిన మీదట, కలెక్టరు తాను అధినిర్ణయించిన నష్టపరిహారమును, ఆ అధినిర్ణయము ననుసరించి దానికి హక్కుకలిగి హితముగల వ్యక్తులకు చెల్లింపజూపవలెను. మరియు తరువాతి ఉపపరిచ్ఛేదములో పేర్కొనిన ఏదోఒక లేక అంతకెక్కువ ఆకస్మికతల వలన నివారించబడిననే తప్ప, దానిని వారికి చెల్లించవలెను.

(2) వారు దానిని స్వీకరించుటకు సమ్మతించక పోయినచో, లేక భూమిని అన్యాక్రాంతము చేయుటకు సమర్థుడైన వ్యక్తి ఎవరును లేనిచో, లేక నష్టపరిహారమును స్వీకరించు హక్కుకు సంబంధించిగాని, దాని భాగనిర్ణయమునకు సంబంధించిగాని ఏదేని వివాదము ఉండునో కలెక్టరు నష్టపరిహార మొత్తమును 18వ పరిచ్ఛేదము క్రింద నిర్దేశమును సమర్పించదగు న్యాయస్థానములో డిపాజిటు చేయవలెను:

అయితే హితముకలిగియున్నట్లు ఒప్పుకొనబడిన ఏ వ్యక్తియైనను అట్టి చెల్లింపును, దాని మొత్తము తగినంతదగుటను గూర్చి అభ్యంతరము తెలుపుచు స్వీకరించవచ్చును:

అంతేకాక ఆ మొత్తమును, అభ్యంతరము తెలుపుచు కాకుండ అన్యథా స్వీకరించిన ఏ వ్యక్తికైనను, 18వ పరిచ్ఛేదము క్రింద ఏదేని దరఖాస్తు పెట్టుకొనుటకు హక్కు ఉండదు:

అంతేకాక ఇంకను, ఇందులోనున్నదేదియు, ఈ చట్టము క్రింద అధినిర్ణయించిన ఏదేని నష్టపరిహారమును పూర్తిగా గాని, అందలి ఏదేని భాగమును గాని స్వీకరించు ఎవరేని వ్యక్తి, శాసనరీత్యా దానికి హక్కు కలిగియున్న వ్యక్తికి దానిని చెల్లించుటకై అతనికిగల బాధ్యతకు భంగము కలిగించదు.

(3) ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికిని కలెక్టరు, సముచిత ప్రభుత్వము యొక్క మంజూరీతో ఏదేని భూమి విషయములో ధనరూప నష్టపరిహారమును అధినిర్ణయించుటకు బదులుగా, ఇతర భూములను ఇచ్చుట ద్వారాగాని, అదే హక్కుమూలము క్రింద కలిగియున్న ఇతర భూములపై భూమిశిస్తును మాఫీచేయుట ద్వారా గాని సంబంధించిన పక్షకారుల హితములను దృష్టియందుంచుకొని న్యాయమగునట్టి ఇతర విధముగా గాని, అట్టి భూమిలో పరిమిత హితము కలిగియున్న వ్యక్తితో ఏదేని ఏర్పాటు చేయవచ్చును.

(4) పై కడపటి ఉపపరిచ్ఛేదములో నున్నదేదియు, భూమిలో హితము కలిగియుండి దాని విషయములో కాంట్రాక్టు చేసుకొనుటకు సమర్థుడైన వ్యక్తితో ఏదేని ఏర్పాటు చేయుటకు కలెక్టరుకు గల అధికారములో జోక్యము కలుగచేసికొనునదిగ గాని, దానిని పరిమితపరచునదిగ గాని భావింపరాదు.

32. (1) పై కడపటి పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింద న్యాయస్థానములో ఏదేని డబ్బు డిపాజిటు చేయబడి, అది ఏ భూమి విషయములో అధినిర్ణయించుట జరిగినదో ఆ భూమి, దానిని అన్యాక్రాంతము చేయుటకు ఎట్టి అధికారము లేని ఎవరేని వ్యక్తికి చెందినదని కాన్పించినచో, న్యాయస్థానము ఆ డబ్బును,–

అన్యాక్రాంతము చేయుటకు సమర్థతలేని వ్యక్తులకుచెందిన భూముల విషయములో డిపాజిటు చేసిన డబ్బును పెట్టుబడి పెట్టుట.

(ఏ) ఏ భూమి విషయములో అది డిపాజిటు చేయడమైనదో ఆ భూమిని ఎటువంటి హక్కుమూలము మరియు స్వామ్యపు షరతుల క్రింద కలిగియున్నారో అటువంటి హక్కుమూలము మరియు స్వామ్యపు షరతుల క్రిందనే కలిగియుండదగు ఏదేని ఇతర భూములను కొనుగోలు చేయుటలో ; లేక

(బీ) వెంటనే అట్లు కొనుగోలు చేయుటకు వీలులేనిచో న్యాయస్థానము సబబని తలచునట్టి ప్రభుత్వ లేక ఇతర ఆమోదిత *సెక్యూరిటీలలో;

పెట్టుబడి పెట్టవలెనని ఉత్తరువు చేయవలెను. మరియు అట్టి పెట్టుబడి నుండి వచ్చు వడ్డీని, లేక ఇతర ఆదాయములను, తత్సమయమున సదరు భూమి స్వాధీనమునకు హక్కుకలిగియుండెడి వ్యక్తికి, లేక వ్యక్తులకు చెల్లించవలెనని ఆదేశించవలెను. అట్టి డబ్బును–

(i) పైన చెప్పినట్లు ఇతర భూములను కొనుగోలు చేయుటలో, లేక

(ii) దానికి సంపూర్ణ హక్కుదారగు వ్యక్తికి లేక వ్యక్తులకు చెల్లించుటలో,

వినియోగించు వరకు అట్లు డిపాజిటుచేసి, పెట్టుబడి పెట్టవలెను.

(2) డబ్బు డిపాజిటు చేయబడిన ఏ కేసులకు ఈ పరిచ్ఛేదము వర్తించునో ఆ కేసులన్నింటిలో న్యాయస్థానము, ఈ క్రింది విషయముల కొరకైన ఖర్చులను వాటికి అనుషంగికమైనట్టి, యుక్తమైన ఛార్జీలన్నింటిని వ్యయములతో సహా కలెక్టరు చెల్లించవలెనని ఉత్తరువు చేయవలెను; అవేవనగా:–

---

*ప్రతిభూతులు.

(ఏ) పైన చెప్పినట్టి పెట్టుబడుల ఖర్చులు.

(బీ) అట్టి డబ్బు తత్సమయమున పెట్టుబడి పెట్టినట్టి సెక్యూరిటీలపై వచ్చిన వడ్డీని, లేక ఇతర ఆదాయమును చెల్లించుట కొరకును, అట్టి డబ్బుయొక్క అసలును న్యాయస్థానము వెలుపల చెల్లించుట కొరకును, చేసిన ఉత్తరువులకైన ఖర్చులు, మరియు ప్రతికూల క్లెయిముదారుల మధ్య వ్యాజ్య కారణముగా జరిగినవి తప్ప, వాటికి సంబంధించిన చర్యలన్నిటికైన ఖర్చులు.

ఇతర కేసులలో డిపాజిటుచేసిన డబ్బుయొక్క పెట్టుబడి.

33. పై కడపటి పరిచ్ఛేదములో పేర్కొనినది కానట్టి ఏదేని కారణమున ఈ చట్టము క్రింద న్యాయస్థానములో ఏదేని డబ్బు డిపాజిటు చేయబడినపుడు ఆ న్యాయస్థానము, అట్టి డబ్బులో హితము కలిగిన లేక హితమును క్లెయిముచేయు ఎవరేని పక్షకారు దరఖాస్తు పెట్టుకొనిన మీదట, తాము సముచితమని తలచునట్టి ప్రభుత్వ సెక్యూరిటీలలో లేక ఆమోదితమైన ఇతర సెక్యూరిటీలలో దానిని పెట్టుబడి పెట్టవలెనని ఉత్తరువు చేయవచ్చును. మరియు అట్టి ఏదేని పెట్టుబడిపై వచ్చు వడ్డీని లేక ఇతర ఆదాయమును, అందు హితముగల పక్షకారులకు, ఆ డబ్బు ఏ భూమి విషయములో డిపాజిటు చేయడమైనదో ఆ భూమి నుండి వారు పొందియుండెడి మేలు లేక దానికి వీలైనంత దరిదాపుగ వుండు మేలు కలుగునని తాము భావించునట్టి రీతిగా కూడబెట్టి చెల్లించవలెనని ఆదేశించవచ్చును.

వడ్డీ చెల్లింపు.

34. భూమిని స్వాధీనము చేసికొనినప్పుడు లేక అంతకు పూర్వము అట్టి నష్ట పరిహారపు మొత్తము చెల్లించబడనప్పుడు లేక డిపాజిటు చేయబడనప్పుడు కలెక్టరు, అట్లు స్వాధీనము చేసికొనబడినప్పటి నుండి అది అట్లు చెల్లింపబడునంత వరకు లేక డిపాజిటు చేయబడునంత వరకు సంవత్సరమునకు తొమ్మిది శాతము రేటు చొప్పున వడ్డీతో అధినిర్ణీత మొత్తమును చెల్లించవలెను:

అయితే అట్టి నష్టపరిహారమును లేక అందలి ఏదేని భాగమును, భూమి స్వాధీనము చేసుకొనబడిన తేదీ నుండి ఒక సంవత్సరము కాలావధిలోపల చెల్లించబడనిచో, లేక డిపాజిటు చేయబడనిచో ఆ నష్టపరిహారపు మొత్తముపై లేక అట్టి కాలావధి ముగిసిన తేదీకి పూర్వము చెల్లించబడని లేక డిపాజిటు చేయబడకుండిన అందలి భాగముపై సదరు ఒక సంవత్సరము కాలావధి ముగిసిన తేదీ నుండి సంవత్సరమునకు పదునైదు శాతము రేటు చొప్పున వడ్డీ చెల్లింపదగియుండును.

## భాగము 6

## భూమిని తాత్కాలికముగ ఆక్రమించుట

బంజరు, లేక సాగుయోగ్యమైన భూమిని తాత్కాలికముగ ఆక్రమించుట, నష్ట పరిహారమును గురించి భేదాభిప్రాయము వున్నపుడు ప్రక్రియ.

35. (1) ఈ చట్టములోని భాగము 7 యొక్క నిబంధనలకు లోబడి, ఏదేని సార్వజనిక ప్రయోజనము కొరకు గాని, ఒక కంపెనీ కొరకుగాని ఏదేని బంజరు, లేక సాగుయోగ్యమైన భూమిని తాత్కాలికముగా ఆక్రమించుట మరియు ఉపయోగించుట అవసరమని సముచిత ప్రభుత్వమునకు తోచినప్పుడెల్లను, సముచిత ప్రభుత్వము, ఆక్రమణ ప్రారంభమైనప్పటి నుండి మూడు సంవత్సరములకు మించకుండ తాను సబబని తలచునట్టి కాలావధిపాటు ఆ భూమిని ఆక్రమించవలసినదిగాను మరియు ఉపయోగించవలసినదిగాను కలెక్టరును ఆదేశించవచ్చును.

(2) తదుపరి కలెక్టరు, అట్టి భూమి ఏ ప్రయోజనము కొరకు అవసరమైనదో తెల్పుచు ఆ భూమిలో హితముగల వ్యక్తులకు వ్రాతమూలకముగా నోటీసు నీయవలెను. మరియు పైన చెప్పిన కాలావధిపాటు దానిని ఆక్రమించుటకొరకును, ఉపయోగించుట కొరకును, దాని నుండి తీసుకొనబడు వస్తువులు (ఏవేని ఉన్నచో) వాటి కొరకును, తాను మరియు అట్టి వ్యక్తులు వ్రాతమూలకముగ కరారు చేసుకొనినట్టి నష్టపరిహారమును వెరశి పైకముగా గాని, నెలసరి లేక ఇతర నియతకాలికమైన చెల్లింపుల ద్వారా గాని వారికి చెల్లించవలెను.

(3) నష్టపరిహారము తగినంతదగుటను గురించి గాని, దాని భాగనిర్ణయమును గురించి గాని కలెక్టరు మరియు హితముగల వ్యక్తుల మధ్య భేదాభిప్రాయమేర్పడినచో, కలెక్టరు అట్టి భేదాభిప్రాయమును నిర్ణయముకొరకై న్యాయస్థానమునకు నిర్దేశించవలెను.

*ప్రవేశించి, స్వాధీనము చేసికొనుటకు అధికారము మరియు తిరిగి ఇచ్చివేసిన మీదట నష్ట పరిహారము.*

36. (1) 35వ పరిచ్ఛేదము క్రింద నష్టపరిహారమును చెల్లించిన మీదట లేక అట్టి కరారును నిష్పాదించుకొనిన మీదట లేక నిర్దేశమును చేసిన మీదట, కలెక్టరు ఆ భూమిపై ప్రవేశించి, దానిని స్వాధీనము చేసికొని, సదరు నోటీసు నిబంధనల ననుసరించి దానిని ఉపయోగించవచ్చును, లేక ఉపయోగించుటకు అనుమతించవచ్చును.

(2) కాలావధి ముగిసిన మీదట కలెక్టరు, కరారు ద్వారా నిబంధన చేయబడని, భూమికి కలిగిన నష్టము (ఏదేని ఉన్నచో) దాని కొరకు నష్టపరిహారమును హితముగల వ్యక్తులకు చెల్లించవలెను లేక చెల్లింపజూపవలెను. మరియు ఆ భూమిని అందు హితముగల వ్యక్తులకు తిరిగి ఇచ్చివేయవలెను:

అయితే, ఆ భూమిని, అట్టి కాలావధి ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము ఏ ప్రయోజనము కొరకు ఉపయోగించుచుండిరో ఆ ప్రయోజనము కొరకు ఉపయోగించుటకు శాశ్వతముగా పనికి రాకుండా పోయినచో, మరియు హితముగల వ్యక్తులు అట్లు కోరినచో సముచిత ప్రభుత్వము ఆ భూమి ఒక సార్వజనిక ప్రయోజనముకొరకు లేక ఒక కంపెనీ కొరకు శాశ్వతముగా అవసరమైయుండిన ఎట్లో అట్లే దానిని ఆర్జించుటకు ఈ చట్టము క్రింద చర్య తీసుకొనవలెను.

*భూమి స్థితిని గురించి భేదాభిప్రాయము.*

37. ఆ కాలావధి ముగిసినప్పుడు భూమి స్థితిని గురించి లేక సదరు కరారుకు సంబంధించిన ఏదేని విషయమును గురించి కలెక్టరు మరియు హితముగల వ్యక్తుల మధ్య భేదాభిప్రాయము ఏర్పడినచో కలెక్టరు అట్టి భేదాభిప్రాయమును నిర్ణయము కొరకై న్యాయస్థానమునకు నిర్దేశించవలెను.

## భాగము 7

## కంపెనీల కొరకు భూమి ఆర్జన

38. x x x x x x x x x.

*పారిశ్రామిక వ్యవస్థను కొన్ని ప్రయోజనముల కొరకు కంపెనీగా భావించుట.*

38ఏ. ఒక వ్యక్తికిగాని, వ్యక్తుల అసోసియేషనుకు గాని చెందియుండి వంద మందికి తక్కువ కాకుండ కార్మికులను నియమించియుండి మరియు కంపెనీకానట్టి ఒక పారిశ్రామిక వ్యవస్థ అయియుండి ఆ వ్యవస్థ నియమించిన కార్మికులకు, నివాస గృహములను నిర్మించుట కొరకు గాని, ప్రత్యక్షముగా అందుకు సంబంధించిన సౌకర్యములను ఏర్పాటు చేయుట కొరకుగాని భూమిని ఆర్జించగోరు వ్యవస్థను, అట్టి ఆర్జనకు సంబంధించినంతమేరకు ఈ భాగము నిమిత్తము ఒక కంపెనీగా భావించవలెను. మరియు పరిచ్ఛేదములు 4, 5ఏ, 6, 7, మరియు 50లలో కంపెనీని గూర్చిన నిర్దేశములను అట్టి వ్యవస్థను గూర్చిన నిర్దేశములుగా కూడ అన్వయించవలెను.

*సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ సమ్మతి, మరియు ఆవశ్యకమైన కరారును నిష్పాదించుట.*

39. 6 నుండి 16 వరకు గల ( ఈ రెంటిని కలుపుకొని) పరిచ్ఛేదముల మరియు 18 నుండి 37 వరకుగల (ఈ రెంటిని కలుపుకొని) పరిచ్ఛేదముల నిబంధనలను, ఈ భాగము క్రింద ఏదేని కంపెనీకొరకు భూమిని ఆర్జించుటకు, సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ సమ్మతితో తప్ప మరియు ఆ కంపెనీ ఇందు ఇటు పిమ్మట పేర్కొనిన కరారును నిష్పాదించిననే తప్ప, అమలుపరచరాదు.

పూర్వ పరిశీలన.

40· (1) పరిచ్ఛేదము 5ఏ యొక్క ఉపపరిచ్ఛేదము (2) క్రింద కలెక్టరు ఇచ్చిన నివేదికపై గాని ఇందు ఇటు పిమ్మట నిబంధించినట్లు పరిశీలన జరుపుట ద్వారా గాని–

(ఏ) ఆర్జనయొక్క ఉద్దేశము, కంపెనీ నియమించిన కార్మికులకు నివాస గృహములను నిర్మించుట కొరకు లేక ప్రత్యక్షముగా అందుకు సంబంధించిన సౌకర్యములను ఏర్పాటు చేయుట కొరకు భూమిని సేకరించుటయే అని, లేక

(ఏఏ) అట్టి ఆర్జన, ఒక సార్వజనిక ప్రయోజనము కొరకైన ఏదేని పరిశ్రమ లేక పనిలో నిమగ్నమైన, లేక నిమగ్నమగుటకు చర్యలు తేసుకొనుచున్న ఒక కంపెనీకొరకు ఏదేని భవనమును, లేక నిర్మాణమును నిర్మించుట కొరకు అవసరమని, లేక

(బీ) అట్టి ఆర్జన ఏదేని నిర్మాణమును నిర్మించుటకు అవసరమని మరియు అట్టి నిర్మాణము ప్రజలకు ఉపయోగకరముగ ఉండవచ్చునని

సముచిత ప్రభుత్వము తృప్తిచెందిననే తప్ప, అట్టి సమ్మతిని ఈయరాదు·

(2) అట్టి పరిశీలనను, సముచిత ప్రభుత్వము నియతము చేయునట్టి సమయమునను, స్థలమునందును ఆ ప్రభుత్వము నియమించునట్టి అధికారి జరుప వలెను·

1908 లోని 5వ చట్టము·

(3) అట్టి అధికారి, ఒక సివిలు న్యాయస్థానము విషయములో సివిలు ప్రక్రియా స్మృతి, 1908 ద్వారా నిబంధించినట్టి పద్ధతుల ద్వారానే వీలైనంత వరకు అట్టి రీతిగానే సాక్షులను సమను చేయవచ్చును· వారు హాజరగునట్లు చేయవచ్చును· మరియు దస్తావేజులను దాఖలు చేయవలెనని బలవంతపెట్టవచ్చును·

సముచిత ప్రభుత్వముతో కరారు·

41· పరిచ్ఛేదము 5ఏ యొక్క ఉపపరిచ్ఛేదము (2) క్రింద కలెక్టరు ఏదేని నివేదికను ఇచ్చినచో, దానిని పరిశీలించిన పిమ్మట లేక 40వ పరిచ్ఛేదము క్రింద పరిశీలన జరుపు అధికారి ఇచ్చిన నివేదికపై, ప్రతిపాదించిన ఆర్జన 40వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని ఖండము (ఏ), లేక ఖండము (ఏఏ), లేక ఖండము (బీ)లో నిర్దేశించిన ఏదేని ప్రయోజనము కొరకేనని సముచిత ప్రభుత్వము తృప్తి చెందినచో ఆ ప్రభుత్వము తృప్తిచెందునట్లు ఈ క్రింది విషయముల కొరకు ఏర్పాటు చేయుచు సముచిత ప్రభుత్వముతో కరారు చేసుకొనవలెనని ఆ కంపెనీని కోరవలెను, అవేవనగా:–

(1) ఆ ఆర్జనకైన ఖర్చు సముచిత ప్రభుత్వమునకు చెల్లించుట;

(2) అట్లు చెల్లించిన మీదట భూమిని కంపెనీకి అంతరణచేయుట;

(3) ఆ భూమిని కంపెనీ ఏ నిబంధనలపై కలిగియుండునో;

(4) ఆ ఆర్జన, నివాస గృహములను నిర్మించుటకు గాని అందుకు సంబంధించిన సౌకర్యములను ఏర్పాటు చేయుటకు గాని అయినయెడల, నివాస గృహములను, లేక సౌకర్యములను ఏ గడువులోపల, ఏ షరతులపై మరియు ఏ రీతిగా నిర్మించవలెనో, లేక ఏర్పాటు చేయవలెనో·

(4ఏ) ఆ ఆర్జన ఒక సార్వజనిక ప్రయోజనము కొరకైన ఏదేని పరిశ్రమలో లేక పనిలో నిమగ్నమైన లేక నిమగ్నమగుటకు చర్యలు తీసుకొనుచున్న ఒక కంపెనీ కొరకు ఏదేని భవనమును, లేక నిర్మాణమును నిర్మించుట కొరకైన యెడల ఆ భవనమును, లేక నిర్మాణమును ఏ గడువు లోపల మరియు ఏ షరతులపై నిర్మించవలెనో, లేక చేయవలెనో; మరియు

(5) ఆ ఆర్జన ఏదేని ఇతర నిర్మాణమును నిర్మించుట కొరకైన యెడల ఆ నిర్మాణమును ఏ గడువులోపల మరియు ఏ షరతులపై చేయవలెనో, నిర్వహించవలెనో మరియు ప్రజలు ఏ నిబంధనలపై ఆ నిర్మాణమును ఉపయోగించుటకు హక్కుకలిగి యుందురో.

42. అట్టి ప్రతియొక కరారును, నిష్పాదించిన పిమ్మట వీలైనంత త్వరగా దానిని రాజపత్రములో ప్రచురించవలెను; తదుపరి (ప్రజలు ఏ నిబంధనలపై ఆ నిర్మాణమును ఉపయోగించుటకు హక్కు కలిగియుందురో ఆ నిబంధనలకు సంబంధించినంత వరకు) అది ఈ చట్టములో అంతర్భాగమైయుండిన ఎట్లో అట్లే అమలు కలిగి యుండును.

కరారు యొక్క ప్రచురణ.

43. ఏదేని రైల్వే, లేక ఇతర కంపెనీతో చేసుకొనిన ఏదేని కరారు క్రింద సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా ఇన్ కౌన్సిలు, సెక్రటరీ ఆఫ్ స్టేట్, కేంద్ర ప్రభుత్వము, లేక ఏదేని రాజ్యప్రభుత్వము అట్టి కంపెనీ ప్రయోజనము కొరకు భూమిని సమకూర్చవలసియున్నదో లేక సమకూర్చవలసియుండినదో ఆ కంపెనీకొరకు భూమిని ఆర్జించుటకు 39 నుండి 42 వరకు గల (ఈ రెంటిని కలుపుకొని) పరిచ్ఛేదముల నిబంధనలు వర్తించవు. మరియు లాండ్ ఎక్విజిషన్ చట్టము, 1870 లోని తత్సమాన పరిచ్ఛేదములు ఎప్పుడును వర్తించియుండనట్లే భావించవలెను.

ప్రభుత్వము కరారు ద్వారా కంపెనీలకు భూమిని సమకూర్చవలసియున్న యెడల 39 నుండి 42 వరకు గల పరిచ్ఛేదములు వర్తింపకుండుట.

1870 లోని 10వ చట్టము.

44. ఒక రైల్వే కంపెనీ ప్రయోజనముల కొరకు భూమిని ఆర్జించిన సందర్భములో 43వ పరిచ్ఛేదములో పేర్కొనిన కరారుయొక్క ఉనికిని, ప్రభుత్వ ఉత్తరువు ద్వారా ముద్రించినట్లు తాత్పర్యమగు ఆ కరారుయొక్క ముద్రిత ప్రతిని దాఖలుచేయుట ద్వారా రుజువు చేయవచ్చును.

రైల్వే కంపెనీతో చేసుకొనిన కరారును ఎట్లు రుజువు చేయవచ్చును.

44ఏ. ఈ భాగము క్రింద ఏ కంపెనీకొరకు ఏదేని భూమిని ఆర్జించుట జరిగినదో అట్టి కంపెనీ ఏదియు, సదరు భూమిని గాని అందలి ఏదేని భాగమును గాని, సముచిత ప్రభుత్వము యొక్క పూర్వ మంజూరీతో తప్ప, విక్రయము, తాకట్టు, దానము, లీజు ద్వారాగాని, అన్యథా గాని అంతరణ చేయుటకు హక్కుకలిగియుండదు.

అంతరణ మొదలైన వాటిపై నిర్బంధన.

44బి. ఈ చట్టములో ఏమియున్నప్పటికిని ప్రభుత్వ కంపెనీకానట్టి ఏదేని ప్రైవేటు కంపెనీకొరకు ఏ భూమిని గాని, 40వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని ఖండము (ఏ)లో పేర్కొనిన ప్రయోజనము కొరకు తప్ప, ఈ భాగము క్రింద ఆర్జించ రాదు.

ప్రభుత్వ కంపెనీలు కానట్టి ప్రైవేటు కంపెనీల కొరకై ఒకానొక ప్రయోజనము కొరకు తప్ప, ఈ భాగము క్రింద భూమిని ఆర్జించరాదు.

<u>విశదీకరణ</u>:– "ప్రైవేటు కంపెనీ", మరియు "ప్రభుత్వ కంపెనీ" అను పదములు, కంపెనీల చట్టము, 1956లో ఆయా పదములకు ఒసగిన అర్థమునే కలిగి యుండును.

1956 లోని 1వ చట్టము.

## భాగము 8

## వివిధ విషయములు

45. (1) ఈ చట్టము క్రింది ఏదేని నోటీసును 4వ పరిచ్ఛేదము క్రింది నోటీసు విషయములో అందు పేర్కొనిన అధికారి, ఏదేని ఇతర నోటీసు విషయములో కలెక్టరు, లేక న్యాయాధీశుడు, లేక అతని ఆదేశము ననుసరించి సంతకము చేసినట్టి ప్రతిని అందజేయుట ద్వారా లేక ఈయజూపుట ద్వారా తామీలు చేయవలెను.

నోటీసుల తామీలు.

(2) ఆచరణ సాధ్యమైనప్పుడెల్లను నోటీసును, అందు పేర్కొనిన వ్యక్తికి తామీలు చేయవలెను.

(3) అట్టి వ్యక్తి జాడతెలియనపుడు, అతనితో నివసించుచున్నట్టి అతని కుటుంబములోని ఎవరేని వయోజన సభ్యునికి తామీలు చేయవచ్చును. అట్టి సభ్యుని జాడ తెలియరానిచో నోటీసును అందు పేర్కొనిన వ్యక్తి సాధారణముగా నివసించుచుండు లేక వర్తకము సాగించుచుండు ఇంటి బయటి ద్వారముపై దాని ప్రతిని అంటించుట ద్వారా, లేక పైన చెప్పిన అధికారియొక్క, లేక కలెక్టరుయొక్క కార్యాలయములో లేక న్యాయస్థానములో స్పష్టముగా కనిపించుచోట మరియు అర్జించవలసిన భూమిపై స్పష్టముగా కనిపించు ఏదేని భాగములో కూడ దాని ప్రతిని అంటించుట ద్వారా తామీలు చేయవలెను:

1898 లోని 6వ చట్టము.

అయితే కలెక్టరు, లేక న్యాయాధీశుడు ఆదేశించినచో, నోటీసును, అందు పేర్కొనిన వ్యక్తికి జాబులో అతని కడపటి నివాసము, చిరునామా, లేక వర్తక స్థలమని ఎరిగినట్టి స్థలమునకు అతనిని సంబోధించి, భారత తపాల కార్యాలయ చట్టము 1898 యొక్క 3వ భాగము క్రింద రిజిస్టరు చేసిన టపా ద్వారా అతనికి పంపవచ్చును. మరియు దాని తామీలును చిరునామాదారు ఇచ్చిన రసీదును దాఖలుచేయుట ద్వారా రుజువు చేయవచ్చును.

భూమి ఆర్జనలో ఆటంకము కలిగించి నందులకు శాస్తి.

46. 4వ పరిచ్ఛేదము ద్వారా లేక 8వ పరిచ్ఛేదము ద్వారా ప్రాధికారము పొందిన ఏదేని కార్యమును చేయుటలో ఎవరేని వ్యక్తిని బుద్ధిపూర్వకముగా ఆటంకపరచు, లేక 4వ పరిచ్ఛేదము క్రింద త్రవ్విన కందకమును లేక పెట్టిన గుర్తును బుద్ధిపూర్వకముగా పూడ్చు, నాశముచేయు, చెరుపు కలిగించు, లేక తావునుండి తీసివేయు వారెవరైనను, మేజిస్ట్రేటు సమక్షమున దోషస్థాపన జరిగిన మీదట ఒక మాసమునకు మించని ఏదేని కాలావధికి కారావాసముతో లేక అయిదు వందల రూపాయలకు మించని జుర్మానాతో, లేక ఈ రెండింటితో శిక్షింపదగియుందురు.

మేజిస్ట్రేటుకు అర్పించునట్లు చేయుట.

47. ఏదేని భూమిని ఈ చట్టము క్రింద స్వాధీనము చేసికొనుటలో కలెక్టరుకు వ్యతిరేకించినచో, లేక ఆటంకపరచినచో, అతడు, తానే ఒక మేజిస్ట్రేటు అయినచో ఆ భూమి తనకు అర్పించబడునట్లు చేయవలెను; తాను మేజిస్ట్రేటుకానిచో, ఒక మేజిస్ట్రేటుకు లేక (కలకత్తా, మద్రాసు, బొంబాయి పట్టణములలో) పోలీసు కమీషనరుకు దరఖాస్తు చేయవలెను; అట్టి మేజిస్ట్రేటు లేక (సందర్భానుసారముగ) కమీషనరు ఆ భూమిని కలెక్టరుకు అర్పించునట్లు చేయవలెను.

ఆర్జనను పూర్తి చేయుట తప్పని సరికాదు. కాని పూర్తిచేయనపుడు నష్టపరిహారము చెల్లించవలసి యుండుట.

48. (1) 36వ పరిచ్ఛేదములో నిబంధించబడిన సందర్భములో తప్ప, ప్రభుత్వమునకు, స్వాధీనపరచుకొనబడని ఏదేని భూమియొక్క ఆర్జనను ఉపసంహరించుకొను స్వేచ్ఛ ఉండును.

(2) ప్రభుత్వము ఏదేని అట్టి ఆర్జనను ఉపసంహరించుకొన్నప్పుడెల్లను, కలెక్టరు, దాని క్రింది నోటీసు లేక ఏవేని చర్యల పరిణామముగా సొంతదారుకు కలిగిన చెరుపుకొరకై ఈయవలసిన నష్టపరిహారమును నిర్ధారణ చేయవలెను; సదరు భూమికి సంబంధించి ఈ చట్టము క్రింది చర్యలను నడుపుటలో అతనికి యుక్తముగా అయిన ఖర్చులన్నిటితో సహా అట్టి మొత్తమును హితముగల వ్యక్తికి చెల్లించవలెను.

(3) ఈ చట్టముయొక్క భాగము 3 లోని నిబంధనలు వీలైనంతమేరకు, ఈ పరిచ్ఛేదము క్రింద చెల్లించవలసిన నష్టపరిహారమును నిర్ధారణ చేయుటకు వర్తించును.

49· (1) ఏదేని ఇల్లు, వినిర్మాణ శాల లేక ఇతర భవనములోని ఒక భాగమును మాత్రమే ఆర్జించు ప్రయోజనము కొరకు ఈ చట్టపు నిబంధనలను, ఆ మొత్తము ఇంటిని, వినిర్మాణ శాలను లేక భవనమును అట్లు ఆర్జించవలెనని దాని సొంతదారు వాంఛించినచో, అమలుపరచరాదు: ఇంటిలో లేక భవనములో భాగమును ఆర్జించుట·

అయితే 11వ పరిచ్ఛేదము క్రింద కలెక్టరు తన అధినిర్ణయమును చేయుటకు పూర్వము ఎప్పుడైనను సొంతదారు, అట్టి మొత్తము ఇంటిని, వినిర్మాణ శాలను లేక భవనమును అట్లు ఆర్జించవలెనని తాను వ్యక్తము చేసిన వాంఛను వ్రాతమూలకమైన నోటీసు ద్వారా ఉపసంహరించుకొనవచ్చును లేక దానిని మార్పు చేయవచ్చును:

అంతేకాక ఈ చట్టము క్రింద తీసుకొనుటకు ప్రతిపాదించిన ఏదేని భూమి ఈ పరిచ్ఛేదపు భావపరిధిలో ఒక ఇంటి, వినిర్మాణ శాల, లేక భవనముయొక్క అంతర్భాగము అగునా కాదా అను ప్రశ్న ఏదేని ఉత్పన్నమైనచో కలెక్టరు, అట్టి ప్రశ్నను నిర్ధారణకొరకై న్యాయస్థానమునకు నిర్దేశించవలెను; ఆ ప్రశ్నను నిర్ధారణ చేయువరకు అట్టి భూమిని స్వాధీనపరచుకొనరాదు:

అట్టి నిర్దేశముపై నిర్ణయము నొసగుటలో తీసుకొనుటకు ప్రతిపాదించిన భూమియొక్క అవసరము, ఆ ఇంటిని, వినిర్మాణ శాలను, లేక భవనమును పూర్తిగాను, నిరాటంకముగాను ఉపయోగించుటకు యుక్తమైనదేనా అను ప్రశ్నను న్యాయస్థానము, దృష్టియందుంచుకొనవలెను·

(2) ఆర్జించవలసిన భూమిని హితముగల వ్యక్తికి చెందిన ఇతర భూమి నుండి వేరు చేసిన కారణముగ అతడు 23వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) మూడవ ఖండిక క్రింద ఏదేని క్లెయిము చేసిన సందర్భములో సముచిత ప్రభుత్వము, ఆ క్లెయిము అయుక్తమైనదని లేక అధికమైనదని అభిప్రాయపడినచో, కలెక్టరు అధినిర్ణయము చేయుటకు పూర్వము ఎప్పుడైనను, మొదట ఆర్జింపదలచిన భూమి దేనిలో భాగమై యున్నదో ఆ మొత్తము భూమిని ఆర్జించుటకు సముచిత ప్రభుత్వము ఉత్తరువు చేయవచ్చును·

(3) ఇందు ఇంతకు పూర్వము, కడపటి నిబంధన చేయబడినట్టి సందర్భములో, 6 నుండి 10 వరకు గల ( ఈ రెంటిని కలుపుకొని) పరిచ్ఛేదముల క్రింద ఎట్టి క్రొత్త ప్రఖ్యానముగాని, ఇతర చర్యగాని అక్కరలేదు: కాని కలెక్టరు, సముచిత ప్రభుత్వముయొక్క ఉత్తరువు నకలును ఆలస్యము చేయకుండ హితముగల వ్యక్తికి అందచేయవలెను; అటు పిమ్మట 11వ పరిచ్ఛేదము క్రింద అధినిర్ణయము చేయుటకు పూనుకొనవలెను·

50· (1) ఏదేని ఒక స్థానిక ప్రాధికార సంస్థ లేక కంపెనీ నియంత్రణలో నున్న లేక దానిచే నిర్వహించబడుచున్న ఏదేని నిధి ఖర్చుతో భూమిని ఆర్జించు ప్రయోజనము కొరకు ఈ చట్టపు నిబంధనలను అమలుపరచినయెడల, అట్టి ఆర్జనకైన ఖర్చులు, మరియు దానికి ఆనుషంగికమైన ఖర్చులు అట్టి నిధినుండి లేక కంపెనీచే భరించబడవలెను: స్థానిక ప్రాధికార సంస్థ లేక కంపెనీ ఖర్చుపై భూమిని ఆర్జించుట·

(2) అట్టి కేసులలో కలెక్టరు యొక్క లేక న్యాయస్థానము యొక్క సమక్షమున జరుగు ఏదేని చర్యలో సంబంధించిన స్థానిక సంస్థ లేక కంపెనీ హాజరు కావచ్చును మరియు నష్టపరిహార మొత్తమును నిర్ధారణచేయు ప్రయోజనము కొరకు సాక్ష్యము తేవచ్చును:

అయితే అట్టి ఏ స్థానిక ప్రాధికార సంస్థకుగాని, కంపెనీకిగాని, 18వ పరిచ్ఛేదము క్రింద నిర్దేశించబడవలెనని అడుగుటకు హక్కు ఉండదు·

**స్టాంపు సుంకము మరియు ఫీజు నుండి మినహాయింపు.**

51. ఈ చట్టము క్రింద చేసినట్టి అధినిర్ణయమునకుగాని చేసికొనిన కరారుకు గాని, స్టాంపు సుంకము విధించరాదు. మరియు అట్టి ఏదేని అధినిర్ణయము లేక కరారు క్రింద క్లెయిముచేయు ఏ వ్యక్తియు దాని నకలుకొరకు ఎట్టి ఫీజు చెల్లించ నవసరములేదు.

**ధృవీకృత నకలును సాక్ష్యముగా తీసికొనుట.**

51ఏ. రిజిస్ట్రీకరణ చట్టము, 1908, (1908లోని 16వ చట్టము) యొక్క 57వ పరిచ్ఛేదము క్రింద ఇచ్చిన నకలుతోసహా ఆ చట్టము క్రింద రిజిస్టరు చేయబడిన దస్తావేజు యొక్క ధృవీకృత నకలును, ఈ చట్టము క్రింది ఏదేని చర్యలో, అట్టి దస్తావేజులో వ్రాసియున్న వ్యవహారమునకు సాక్ష్యముగా స్వీకరించవచ్చును.

**చట్టము ననుసరించి చేసిన దేనికొరకైనను వేయు దావాల విషయములో నోటీసు.**

52. ఈ చట్టముననుసరించి చేసిన దేనికొరకైనను ఏ వ్యక్తిపైగాని, ఉద్దేశింపబడిన చర్యను గురించి అట్టి వ్యక్తికి ఒక మాసము ముందుగా వ్రాతపూర్వకముగా నోటీసు ఈయకుండా లేక తగినంత నష్టపరిహారము ఇవ్వజూపబడిన పిమ్మట ఎట్టి దావాను గాని ఇతర చర్యనుగాని ప్రారంభించరాదు లేక నడుపరాదు.

**న్యాయస్థానము సమక్షమున గల చర్యలకు సివిలు ప్రక్రియా స్మృతి వర్తించుట. 1908 లోని 5వ చట్టము.**

53. సివిలు ప్రక్రియా స్మృతి, 1908 యొక్క నిబంధనలు, ఈ చట్టములో నున్న దేనికైనను అనుగుణముగా లేనంతమేరకు తప్ప, చట్టము క్రింద న్యాయస్థానము సమక్షమున గల చర్యలన్నింటికి వర్తించును.

**న్యాయస్థానము సమక్షమున గల చర్యలలో అపీళ్ళు. 1908 లోని 5వ చట్టము.**

54. మూల డిక్రీలపై అపీళ్ళకు వర్తించదగు సివిలు ప్రక్రియా స్మృతి, 1908 యొక్క నిబంధనలకు లోబడి మరియు తత్సమయమున అమలునందున్న ఏదేని అనుశాసనములో తద్విరుద్ధముగా ఏమియున్నప్పటికిని, ఈ చట్టము క్రింది ఏ చర్యలలోనైనను న్యాయస్థానపు అధినిర్ణయముపై, లేక అధినిర్ణయములోని ఏదేని భాగముపై ఉన్నత న్యాయస్థానమునకు మాత్రమే అపీలు ఉండును. మరియు పైన చెప్పినట్టి అపీలులో ఉన్నత న్యాయస్థానము ఇచ్చిన ఏదేని డిక్రీపై, సివిలు ప్రక్రియా స్మృతి, 1908 యొక్క 110వ పరిచ్ఛేదము మరియు దాని 45వ ఉత్తరువులోని నిబంధనలకు లోబడి, సర్వోన్నత న్యాయస్థానమునకు అపీలు ఉండును.

**నియమములు చేయు అధికారము.**

55. (1) సముచిత ప్రభుత్వము ఈ చట్టమును అమలుపరచుటకు సంబంధించిన విషయములన్నింటిలో అధికారులకు మార్గదర్శకముగానుండుటకై ఈ చట్టమునకు అనుగుణముగా నుండు నిర్ణయములు చేయుటకు అధికారము కలిగియుండును; అట్లు చేసిన నియమములను ఆయా సమయములందు మార్చవచ్చును లేక వాటికి చేర్పులు చేయవచ్చును:

అయితే ఈ చట్టములోని భాగము 7 యొక్క ప్రయోజనములను నెరవేర్చుటకై నియమములు చేయు అధికారమును కేంద్ర ప్రభుత్వము వినియోగించదగియుండును; రాజ్యప్రభుత్వములకును, కేంద్ర మరియు రాజ్యప్రభుత్వ అధికారులకును మార్గదర్శకముగా నుండుటకై అట్టి నియమములను చేయవచ్చును:

అంతేకాక కేంద్ర ప్రభుత్వము చేసిన అట్టి ప్రతియొక నియమమును, దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా పార్లమెంటు అధివేశనములో నున్నప్పుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే అధివేశనములో గాని వరుసగా వచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. అది పైన చెప్పినట్టి అధివేశనమునకు, లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వము ఉభయ సదనములు ఆ నియమములో ఏదేని మార్పు

చేయుటకు అంగీకరించినచో లేక ఉభయ సదనములు ఆ నియమము చేయరాదని అంగీకరించినచో అటు పిమ్మట ఆ నియమము సందర్భానుసారముగ, అట్లు మార్పు చేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును, లేక ఎట్టి ప్రభావమును కలిగియుండదు; అయినప్పటికిని అట్టి ఏదేని మార్పుగాని లేక రద్దుగాని, అంతకు పూర్వమే ఆ నియమము క్రింద చేసియుండిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగింపదు.

అంతేకాక ఇంకను, రాజ్యప్రభుత్వము చేసిన అట్టి ప్రతియొక నియమమును దానిని చేసిన పిమ్మట వీలైనంత శీఘ్రముగా రాజ్యశాసనమండలి సమక్షమున ఉంచవలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద నియమములనుచేయు, వాటిని మార్చు మరియు వాటికి చేర్పులుచేయు అధికారము, ఆ నియమములను ముందుగా ప్రచురించిన పిమ్మట చేయవలెనను, మార్చవలెనను లేక చేర్చవలెనను షరతుకు లోబడి ఉండును.

(3) అట్టి నియమములను, మార్పులను, చేర్పులన్నింటిని రాజపత్రములో ప్రచురించవలెను; తదుపరి అవి శాసనమువలె అమలు కలిగియుండును.

కె. ఎల్. మోహన్ పూరియు...
కార్యదర్శి, భారత ప్రభుత్వము ...